


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 352, పేజీలు - 08

శుక్రవారం, మే 16, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## నష్టాన్ని పూడ్చాల్సిందే లేదంటే

# సీఎస్ జైలుకే



### - కంచ గచ్చిబౌలిపై సుప్రీంకోర్టు

- సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు
- పర్యావరణ నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను చెప్పాలన్న న్యాయస్థానం
- నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే ప్రభుత్వాధికారులు జైలుకు పోవాల్సి ఉంటుందన్న ధర్మాసనం

**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సంచలనంగా మారిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ నష్టం పూడ్చకపోతే సీఎస్జైలుకు వెళ్లాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చ రించింది. సీఎస్తో పాటు కార్యదర్శులూ జైలుకు పోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. లాంగ్వీక్ఎండ్చూసి ఎందుకు చర్యలు చేపట్టారని అధికారులను అడిగింది. పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చాల్సిందేనని స్పష్టం చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం కీలక వ్యాఖలు చేసింది. పర్యావరణ నష్టం పూడ్చకపోతే సీఎస్ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించిన ధర్మాసనం హెచ్చరించింది. కాగా సీఈసీ దాఖలు చేసిన అఫిడవిట్పై కౌంటర్ వేసేందుకు కొంత సమయం కావాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. దీంతో జులై 23వ తేదీలోపు గతంలో ఉన్నట్లుగా అక్కడ పర్యావరణాన్ని పునరుద్ధరించాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంటూ తదుపరి విచారణ జులై 23 వ తేదీకి వాయిదా వేసింది. అలాగే విద్యార్థులపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలంటూ దాఖలైన ఐఏను సుప్రీంకోర్టు త్రోసి పుచ్చింది. ఆ విషయంలో ప్రత్యేకంగా మరో పిటీషన్ను దాఖలు చేయాలని, ఈ కేసులో కలపకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. గత విచారణ సందర్భంగా పర్యావరణ వన్యప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెబుతూ నాలుగు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటివరకు యథాస్థితి కొనసాగించాలని పేర్కొంది. ఈలోగా ఒక్క చెట్టు కూడా నరకడానికి ఒప్పుకోమని స్పష్టం చేసింది. విచారణ ప్రారంభంలోనే వివరాలను పరిశీలించిన సీజేఐ తెలంగాణ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇష్టానుసారంగా డజన్ల కొద్దీ బుల్డోజర్లతో చెట్లు తొలగించేందుకు వినియోగించారని, ఇదంతా ముందస్తు పథకం ప్రకారమే చేసినట్టుగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా లేదా అన్నది స్పష్టం చేయాలన్నారు. జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలని జస్టిస్ గవాయ్ అన్నారు.

## పాకిస్తాన్ అణ్వాయుధాలు స్వాధీనం చేసుకోండి

### - రాజ్నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాకిస్తాన్ వద్ద ఉన్న అణ్వాయుధాలు సురక్షితంగా లేవని రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ ప్రపంచాన్ని హెచ్చరించారు. పాక్ అణ్వాయుధాలను ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఏఈఏ) పర్యవేక్షించాలని

2లో..

## మోదీ, నితీశ్.. చాతనైతే నన్ను ఆపండి

### - రాహుల్ గాంధీ

**పాట్నా (ప్రశ్న న్యూస్)** బీహార్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, సీఎం నితీశ్ కుమార్ లపై ధ్వజమెత్తారు.

2లో..



2లో..

## కాళేశ్వరం ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

### - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలు
- త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళిక
- అభివృద్ధికి రూ.200 కోట్ల వరకు కేటాయింపునకు సుముఖత

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరి, ప్రాణహిత

2లో..



## రాష్ట్రంలో 19 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం

- 35 వేల మందికి ఉద్యోగాలు
- ఏపీలో పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపు
- రూ.33 వేల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్
- పరిశ్రమల ఆకర్షణే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో దాదాపు రూ.33,000ల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 19 ప్రాజెక్టుల స్థాపనకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. వీటి ద్వారా దాదాపు 35,000ల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఇప్పటి వరకూ జరిగిన 6 సమావేశాల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ వర్గాల అంచనా. ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై డాష్ బోర్డ్ ద్వారా పర్యవేక్షించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 6వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది.



### పెట్టుబడులకు ఆమోదం

ఈ భేటీలో అనకాపల్లి జిల్లా కుమరవరంలో డెక్కన్ ఫైన్ కెమికల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1560 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ సంస్థ ద్వారా

2లో..

## నేను ఎవరితో అనవసరంగా గొడవలు పెట్టుకోను

- మా జోలికి వస్తే వదలను
- ఉత్తమ కార్యకర్తలతో లోకేశ్ సమావేశం
- పార్టీ కేడర్ ఎర్ర బుక్ గురించి అడుగుతున్నారని వెల్లడి
- వేధించిన వారి వివరాలు తమ వద్ద ఉన్నాయన్న మంత్రి

**అమరావతి (ప్రశ్న న్యూస్)** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను గత ప్రభుత్వ హయాంలో ఇబ్బందులకు గురిచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలు తరచూ 'రెడ్ బుక్' గురించి ప్రస్తావిస్తున్నారని గుర్తు చేస్తూ, తమ కార్యకర్తలను వేధించిన వారి వివరాలు తమ వద్ద ఉన్నాయని,

2లో..



## తెలంగాణలో కొత్తగా సైనిక్ స్కూల్

### - కేంద్రమంత్రి బండి ప్రకటన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కొత్తగా మరో సైనిక్ స్కూల్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు కేంద్రం హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎక్స్ ట్విట్టర్ వేదికగా కీలక ప్రకటన చేశారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న బండి సంజయ్ కుమార్ తన నియోజకవర్గ పరిధిలోని రాజన్న సిరిసిల్ల జిల్లా హుస్నాబాద్లో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరుతూ గత నెల 15న రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్నాథ్ సింగ్ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన

2లో..

## హైదరాబాద్, ముంబైలలో ఈడీ సోదాలు

### - రూ. 32 కోట్ల ఆస్తుల స్వాధీనం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముంబైకి చెందిన వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ (వీవీఎంసీ) పరిధిలో వెలుగుచూసిన భారీ కుంభకోణంపై ఈడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం అధికారులు కీలక ముందడుగు వేశారు. ముంబై, హైదరాబాద్ నగరాలతో పాటు మొత్తం 13 ప్రాంతాల్లో ఏకకాలంలో విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం, వజ్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ప్రకటించింది. సుమారు రూ.9.04 కోట్ల నగదుతో

2లో..

## టర్కీ కంపెనీకి భారత్ బిగ్ షాక్

### - సెక్యూరిటీ క్లియరెన్స్ రద్దు, తక్షణమే అమల్లోకి



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత్తో ఉద్రిక్తతల వేళ ప్రపంచ దేశాలు మొత్తం భారత్కు మద్దతు తెలుపుతుండగా టర్కీ, అజర్బైజాన్ మాత్రం పాకిస్తాన్కు సపోర్ట్ చేస్తున్నట్లు ప్రకటించాయి. ఇప్పుడు ఆ సపోర్ట్ ఆ రెండు దేశాల పాలిట శాపమైంది. భారత్కు వ్యతిరేకంగా ఉంటే పరిస్థితులు ఎలా ఉంటాయో గతంలో మాల్దీవులు పడిన అవస్థలను చూసి కూడా అజర్బైజాన్, టర్కీలు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరిచింది. ఈ క్రమంలోనే భారతీయుల నుంచి ఈ రెండు దేశాలు తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నాయి. మన దేశంలో ఛబాయ్కాట్అజర్బైజాన్, ఛబాయ్కాట్ టర్కీ హ్యాష్ట్యాగ్లను నెటిజన్లు

2లో..

## పాకిస్థాన్తో చర్చలు కేవలం ఉగ్రవాదంపైనే

### - కేంద్ర మంత్రి జైశంకర్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాకిస్థాన్ పట్ల భారత్ వైఖరిలో మార్పు లేదని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం, పీవోకేను అప్పగించడంపై తప్పా ఇతర విషయాలపై చర్చించే ప్రసక్తే లేదని మరోసారి స్పష్టం చేశారు. అలాగే పాక్ వద్ద పూర్తి ఉగ్రవాదుల జాబితా ఉందని దాన్ని తమకు ఇస్తే బాగుంటుందని చెప్పారు. అలాగే వారికి మౌలిక సదుపాయాలు కల్పించడం కూడా ఆపేస్తే తాము ద్వైపాక్షిక చర్చలకు సిద్ధం అని పేర్కొన్నారు. భారత్ - పాకిస్థాన్ దేశాల మధ్య ప్రస్తుతానికి ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో ఇరు దేశాలు సంయమనం పాటిస్తున్నాయి.



పహల్గాం ఉగ్రదాడి తర్వాత, పాకిస్థాన్, పీవోకేల్లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భారత్ క్షిపణి దాడులు చేసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇందుకు ప్రతిగా పాకిస్థాన్ దాడి ప్రయత్నాలు చేయగా వాటిని

2లో..

## మధ్యవర్తిత్వంపై ట్రంప్ యూటర్న్

### - మధ్యవర్తిగా లేను సాయం చేశానని ప్రకటన



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా మే 10వ తేదీన రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. భారత్-పాక్ ప్రకటించడానికి ముందే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎక్స్ వేదికగా ఇదే విషయాన్ని పోస్ట్ చేశారు. ఆపై తన మధ్యవర్తిత్వం వల్లే రెండు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చాయని అన్నారు.

2లో..

## లక్ష్మీ నరసింహస్వామిని సేవలో ప్రపంచ సుందరీమణులు

**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని గురువారం సాయంత్రం మిస్ వరల్డ్ పోటీదారులు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న సందరీమణులు ముందుగా అతిథి గృహానికి వెళ్లారు. అక్కడ ప్రొజెక్టర్ ద్వారా వీడియో ప్రెజెంటేషన్లో ఆలయ విశిష్టతను ఆలయ వైస్ చైర్మన్ కిషన్ రావు ప్రపంచ సుందరీ మణులకు వివరించారు. ఆలయ అతిథి గృహం నుంచి ప్రత్యేక బ్యాటరీ వాహనాల్లో కొండపైకి చేరుకున్న ఈ సుందరీమణులు తూర్పు మహాగోపురం వద్ద వేద పండితులు స్వాగతం పలుకగా త్రితల రాజగోపురం, ఆంజనేయస్వామి గుడి, ధ్వజస్తంభం ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. తర్వాత గర్భాలయంలో స్వామి వారి దర్శనంతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

2లో..



ప్రజాప్రశ్న



# పాకిస్తాన్ అణ్వాయుధాలు స్వాధీనం చేసుకోండి

సూచించారు. ఉగ్రవాద శిబిరాలు ఎక్కడ ఉన్నా వాటిని నాశనం చేస్తామని ఆపరేషన్ సిందూర్ అనేది ఉగ్రవాదంపై భారతదేశ నిబద్ధతకు చిహ్నమని పేర్కొన్నారు. తాజాగా జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించిన రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్ దాడుల్లో దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా భారత బలగాల సంసిద్ధతను సమీక్షించారు. రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కూడా పర్యటించారు. పాక్ అణ్వాయుధాలను ఐఏఈఏ స్వాధీనం చేసుకుని వాటిని పర్యవేక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల ఉగ్రవాదులతో పోరాడి దేశం కోసం ప్రాణాలు విడిచిన చేసిన జవాన్లకు ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ నివాళులు అర్పించారు. ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదని అది భారతదేశ నిబద్ధతకు సూచిక అని పేర్కొన్నారు. భారత్‌పై ఉగ్రదాడి జరిగితే దాన్ని యుద్ధ చర్యగానే పరిగణిస్తామని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. భారత దళాలు అద్భుతంగా పోరాడుతున్నాయని క్లిష్ట పరిస్థితుల్లో వారి మధ్య ఉండటం కూడా గర్వకారణమని తేల్చి చెప్పారు. పహల్గామ్ ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు కూడా ఆయన నివాళులర్పించారు. పాకిస్తాన్ షెల్లింగ్‌లో ధ్వంసం అయిన ప్రాంతాలను సందర్శించిన రాజ్‌నాథ్ సింగ్ అక్కడ భారత దళాల సంసిద్ధతను పరిశీలించారు. చినార్ కోర్ (15వ కోర్) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ సిబ్బందితో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అంతకుముందు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కూడా చినార్ కోర్‌లోని డాగర్స్ డివిజన్‌లోని అన్ని ర్యాంకుల అధికారులతో సమావేశం అయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల వద్ద ధైర్యంగా, అలర్ట్‌గా ఉన్నందుకు వారిని అభినందించారు.

# మోదీ, నితీశ్.. చాతనైతే నన్ను ఆపండి

దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్‌లో విద్యార్థులతో 'శిక్షా న్యాయ్ సంవాద్' పేరిట తలపెట్టిన ముఖాముఖి కార్యక్రమానికి వెళుతున్న ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసుల ఆటంకాలను అధిగమించి హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించిన రాహుల్ గాంధీ, బీహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్ వెలుపల ఈ ఘటన చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ కాన్వాయ్‌ను పోలీసులు హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నిలువరించారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయినప్పటికీ, రాహుల్ గాంధీ పట్టువీడకుండా, పోలీసుల అడ్డంకులను దాటుకుని హాస్టల్‌లోకి ప్రవేశించారు. అక్కడ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బీహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని "డబుల్ ఇంజిన్ ధోకాబాజ్ సర్కార్" (డబుల్ ఇంజిన్ మోసపూరిత ప్రభుత్వం) అంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే సామాజిక న్యాయం అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌లను ఉద్దేశించి రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. "నితీశ్ జీ, మోదీ జీ, ఆపగలిగితే ఆపండి. కులగణన తుఫాను సామాజిక న్యాయం, విద్య, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతోంది," అని ఆయన హిందీలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు. "బీహార్ పోలీసులు నన్ను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. కానీ వారు నన్ను ఆపలేకపోయారు, ఎందుకంటే మీ (మైనారిటీ వర్గం) శక్తి నన్ను కాపాడుతోంది. దేశంలో కులగణన చేపట్టాలని మేము ప్రధాని మోదీకి చెప్పాం. మీ ఒత్తిడి వల్లే ప్రధాని మోదీ కులగణన ప్రకటించారు. మీ ఒత్తిడికి భయపడి ఆయన రాజ్యాంగాన్ని నుదుటిపై పెట్టుకున్నారు. కానీ వారి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, మైనారిటీలకు వ్యతిరేకమైనది. ఇది అదానీ-అంబానీల ప్రభుత్వం, మీది కాదు," అని రాహుల్ గాంధీ ఆరోపించారు. "భారత్‌లో, బీహార్‌లో మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, మీకు దక్కాల్సినవన్నీ అమలు చేస్తామని నేను హామీ ఇస్తున్నాను," అని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను ప్రశ్నిస్తూ, "బీహార్‌లోని ఎన్డీయే 'డబుల్ ఇంజిన్ ధోకాబాజ్ సర్కార్' నన్ను అంబేద్కర్ హాస్టల్‌లో దళిత, వెనుకబడిన విద్యార్థులతో సంభాషించకుండా అడ్డుకుంటోంది. విద్యార్థులతో మాట్లాడడం ఎప్పటి నుంచి నేరంగా మారింది? నితీశ్ జీ, మీరు దేనికి భయపడుతున్నారు? బీహార్‌లో విద్య, సామాజిక న్యాయం పరిస్థితిని దాచిపెట్టాలనుకుంటున్నారా?" అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో నిలదీశారు. "భారతదేశం ప్రజాస్వామ్య దేశం, ఇది రాజ్యాంగం ద్వారా నడుస్తుంది, నియంతృత్వం ద్వారా కాదు! సామాజిక న్యాయం, విద్య కోసం మా గొంతును వినిపించకుండా ఎవరూ మమ్మల్ని ఆపలేరు," అని ఆయన మరో పోస్ట్‌లో పేర్కొన్నారు.

# రాష్ట్రంలో 19 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం

1800 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. అదేవిధంగా శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రంలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థ రూ.1400 కోట్ల పెట్టుబడుల ద్వారా 800 మందికి ఉపాధి కల్పించనుంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో పీయూఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1286 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 1200ల ఉద్యోగాల కల్పన జరగనుంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ సంస్థ రూ.2300 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ సంస్థ దాదాపు 1750 మందికి ఉపాధి కల్పించనుంది. రాంబిల్లిలో జుపిటర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.2700 కోట్ల పెట్టుబడుల ద్వారా 2216 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్లో పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో రాంభద్ర ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.228 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఈ సంస్థ ద్వారా 250 ఉద్యోగాలు లభించనున్నాయి. కృష్ణా జిల్లా మల్లవల్లిలో మోహన్ స్పింటెక్స్ సంస్థ రూ.482 కోట్ల పెట్టుబడుల ద్వారా 1525 మందికి ఉపాధి కల్పించనుంది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1779 కోట్ల పెట్టుబడులతో 600ల ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకొచ్చింది. ఏపీఐఐసీ డిపార్ట్‌మెంట్లో తిరుపతి జిల్లాలో వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1061 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎస్ఐపీబీ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సంస్థ ద్వారా 10,098 ఉద్యోగాలు లభించనున్నాయి. చిత్తూరు జిల్లాలో అలీప్ కుప్పం సంస్థ 1500ల మందికి ఉపాధి కల్పించనుంది. ఎనర్జీ డిపార్ట్‌మెంట్లో ఏలూరు జిల్లా నితిన్ సాయి కనస్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడుల ద్వారా 500ల మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.2920 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఈ సంస్థ 230 ఉద్యోగాలు కల్పించనుంది. వైఎస్సార్ కడప జిల్లాలో ఆంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.3941 కోట్ల పెట్టుబడులతో 260 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకొచ్చింది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ రూ.9000 కోట్ల పెట్టుబడులతో 3900ల ఉద్యోగాలు రానున్నాయి. పర్యాటక విభాగంలో తిరుపతిలో బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్పీ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఈ సంస్థ ద్వారా 350 మందికి ఉపాధి కల్పన జరగనుంది. తిరుపతిలో స్రవంతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.327 కోట్ల పెట్టుబడులతో 570 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకొచ్చింది. విశాఖపట్నంలో వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.899 కోట్ల పెట్టుబడులతో 1300ల ఉద్యోగాలు కల్పించనుంది. ఐటీ విభాగంలో తిరుపతి జిల్లా శ్రీసిటీలో డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.2475 కోట్ల పెట్టుబడులకు సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ సంస్థ 5150 ఉద్యోగాలు కల్పించనుంది. కర్నూలు జిల్లాలో సెన్సోరెమ్ ఫోటోనిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1057 కోట్ల పెట్టుబడులతో 622 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకొచ్చింది.

### డాష్ బోర్డ్ తీసుకురావాలి

రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకొచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలు ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలని సూచించారు. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్ర స్థాయి పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డ్ తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. తద్వారా ఏ ప్రాజెక్టు ఏ స్థాయిలో ఉంది అనేది తెలుసుకోవచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పెట్టుబడులతో పాటు వచ్చిన ఉద్యోగాల వివరాలతో పోర్టల్ రావాలని సూచించారు. ఎస్ఐపీబీ సమావేశాల్లో కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలపడంతో పాటు ఇప్పటికే ఆమోదం తెలిపి ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు సంబంధించిన ప్రోగ్రెస్సు వివరించాలని చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### అందుబాటులోకి 50,000ల గదులు

పర్యాటక రంగంలో ప్రాజెక్టుల ఏర్పాటుపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. టూరిజంలో హోటళ్లు, గదుల కొరత ఉందన్నారు. పెద్దఎత్తున హోటల్ రూమ్స్ వస్తే పర్యాటకానికి ఊపు వస్తుందని చెప్పారు. దాదాపు 50,000ల గదులు అందుబాటులోకి తేవాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. వీటి ధరలు అందుబాటులో ఉంటే సందర్శకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారని తెలిపారు. కారవాన్స్‌కు సంబంధించి పాలసీని కూడా సిద్ధం చేసి అమల్లోకి తేవడం ద్వారా కొత్త పర్యాటకులకు నూతన అనుభూతి కలుగుతుందని వివరించారు. తద్వారా పర్యాటక ఆదాయం కూడా పెరుగుతుందని సీఎం వెల్లడించారు. 'ముఖ్యంగా దేవాలయాలకు కుటుంబాలతో వచ్చే వారు ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతావరణంలో ఉండాలనుకుంటారు. రాష్ట్రంలో రద్దీగా ఉండే 21 ఆలయాల్లో వసతి సౌకర్యం పెంచే చర్యలు తీసుకోవాలి. టెంట్లు (గుడారాలు) ఏర్పాటు చేసి వసతి కల్పించే ప్రాజెక్టులను ప్రారంభించాలి. గోదావరి, కృష్ణా నదుల వద్ద నిర్వహిస్తున్న హారతుల కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక శోభ పెంచేలా చేపట్టాలని' అధికారులను చంద్రబాబు ఆదేశించారు. వ్యవసాయ వ్యర్థాలను కొన్ని చోట్ల తగలబెడుతున్నారని సీఎం పేర్కొన్నారు. దీన్ని నివారించాల్సి ఉందని అధికారులకు స్పష్టం చేశారు. చిన్నచిన్న ప్లాంట్ల ద్వారా అగ్రికల్చర్ వేస్ట్‌ను సర్క్యులర్ ఎకానమీగా మార్చాలని సూచించారు. అగ్రికల్చర్ వేస్ట్‌ను సద్వినియోగం చేసుకునే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశాలిచ్చారు.

# కాళేశ్వరం ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

నదులతో పాటు అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది కలిసే త్రివేణి సంగమం వద్ద ఈ పుష్కర వేడుకలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుష్కరాల్లో పాల్గొన్నారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితరులు పవిత్ర త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం నదీమతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నూతనంగా ప్రతిష్ఠించిన 10 అడుగుల సరస్వతీదేవి విగ్రహాన్ని, భక్తుల సౌకర్యార్థం నిర్మించిన 86 గదుల నూతన వసతి సముదాయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. దకాళేశ్వరం ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆలయ సమగ్రాభివృద్ధికి అవసరమైతే రూ.200 కోట్ల వరకు నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాల్లో భాగంగా నిర్వహించిన హారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సరస్వతీ పుష్కరాలకు విచ్చేస్తున్న భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగాన్ని అభినందించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం మొట్టమొదటిసారిగా టెంట్ సిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే గోదావరి, కృష్ణా పుష్కరాలు రానున్నాయని తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహించే అదృష్టం తనకు కలగనుందని అన్నారు. కాళేశ్వరం క్షేత్ర వైభవాన్ని మరింత ఇనుమడింపజేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం, బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించడంతో సరస్వతీ నదికి పుష్కరాలు వస్తాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కర కాలం ఆరంభమైనప్పటికీ, కాళేశ్వరం ఆలయ అర్చకుల సూచన మేరకు గురువారం సూర్యోదయం నుంచి భక్తులు పుష్కర స్నానాలు ఆచరించడం మొదలుపెట్టారు. గురువారం వేకువజామున 5.44 గంటలకు శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద సరస్వతి సరస్వతి ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ పుష్కరాలు ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతాయి. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం 6.45 గంటల నుంచి 7.35 గంటల వరకు సరస్వతి ఘాట్ వద్ద సరస్వతి నవరత్న మాల హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. దీంతో పాటు వివిధ కళా, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. భక్తుల వసతి కోసం రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలిక టెంట్ సిటీని కూడా నిర్మించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో భక్తులకు తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, స్నానఘట్టాల నిర్మాణం, రహదారుల మరమ్మతులు, వాహనాల పార్కింగ్ వంటి విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. పుష్కరాల సమయంలో ప్రతిరోజూ సగటున లక్షన్నర మంది భక్తులు వస్తారని దేవాదాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

# తెలంగాణలో కొత్తగా సైనిక్ స్కూల్

మంత్రికి ఒక లేఖను కూడా అందజేశారు. బండి సంజయ్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రాజ్‌నాథ్ సింగ్ సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం దరఖాస్తును పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ విషయంపై రాజకీయ రాద్ధాంతం చేయడం సరికాదని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయ పార్టీల వైఖరి ఎలా ఉన్నప్పటికీ అందరూ కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సహకరించలేదని, దాని ఫలితంగా రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని ఆయన విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా కేంద్రంతో కలిసి రావాలని ఆయన ఆకాంక్షించారు. సైనిక్ స్కూల్ ఏర్పాటు అనేది ప్రాంతీయ అభివృద్ధికి, విద్యార్థులకు మంచి అవకాశాలను అందిస్తుందని ఆయన ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసి సైనిక్ స్కూల్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

ఇక కేంద్ర మంత్రి బండి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సుమారు రూ. 8,000 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆయన విమర్శించారు. ఈ బకాయిలు చెల్లించకపోవడం వల్ల ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని.. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు మూతపడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని కళాశాలలు విద్యార్థులు ఫీజులు చెల్లించే వరకు వారి సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోందని బండి సంజయ్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని ఆయన కోరారు.

# నేను ఎవరితో అనవసరంగా గొడవలు పెట్టుకోను

వారిపై చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. "నేను ఎవరితోనూ అనవసరంగా గొడవలు పెట్టుకోను, కానీ మా జోలికి వస్తే మాత్రం సహించేది లేదు" అని లోకేశ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానంలో భారీ కుంభకోణం జరిగిందని, ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. గుంతకల్లు నియోజకవర్గం గుత్తి సమీపంలోని రామరాజుపల్లిలో ఉత్తమ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జోన్ %-% 5 కోఆర్డినేటర్ కోవెలమూడి నాని, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం అపూర్వ విజయం సాధించిందని, దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా కోటి సభ్యత్వాలు సాధించి రికార్డు సృష్టించిందని తెలిపారు. ఈ అద్భుత విజయం వెనుక కార్యకర్తల అవిశ్రాంత శ్రమ, అంకితభావం ఉన్నాయని కొనియాడారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఎన్నికలకు నెల రోజుల ముందు అభ్యర్థిని ప్రకటించినా, కార్యకర్తలు భుజాలపై మోసి గెలిపించారని ప్రశంసించారు. పార్టీలో పాత, కొత్త తరం నాయకుల మధ్య సమన్వయం ఉండాలని, కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండి, 'తెలుగుదేశం' అనే ఒకే వర్గంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో మంగళగిరిలో తాను ఓటమిపాలైనా, నిరుత్సాహపడకుండా కసితో పనిచేసి చరిత్ర తిరగరాశానని గుర్తుచేశారు. కార్యకర్తలు అహంకారం విడనాడి, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అధినేత నిర్ణయాలకు అందరూ కట్టుబడి ఉండాలని, ఏదైనా అన్యాయం జరిగితే తనను గానీ, పార్టీ పెద్దలను గానీ సంప్రదించాలని సూచించారు. సమస్యలపై అంతర్గతంగా చర్చించుకుని, బయటకు వచ్చాక "జై తెలుగుదేశం" అని నినదించాలని దిశానిర్దేశం చేశారు.

### త్వరలో మై టీడీపీ యాప్

పార్టీ కార్యక్రమాలను కేడర్‌కు ఎప్పటికప్పుడు చేరవేసేందుకు, సమన్వయం పెంచేందుకు మహానాడు అనంతరం 'మై టీడీపీ' పేరుతో నూతన యాప్‌ను విడుదల చేయనున్నట్లు లోకేశ్ ప్రకటించారు. కేఎస్ఎస్, బూత్, క్లస్టర్ స్థాయిలోని కార్యకర్తలందరికీ ఈ యాప్ ద్వారానే కార్యక్రమాల సమాచారం, సందేశాలు పంపిస్తామని వివరించారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో మినీ మహానాడులు, అలాగే ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో పార్టీ మహానాడు అంగరంగ వైభవంగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో కార్యకర్తలందరూ ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు.

# హైదరాబాద్, ముంబైలలో ఈడీ సోదాలు

పాటు, రూ.23.25 కోట్ల విలువ చేసే బంగారం, వజ్రాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆస్తుల మొత్తం విలువ రూ.32 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ముంబైలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో ఈ అక్రమాలపై పలు కేసులు నమోదయ్యాయి. వీటి ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను ఆక్రమించి, నిబంధనలకు విరుద్ధంగా 2009 సంవత్సరం నుంచి అక్రమ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు ఈడీ గుర్తించింది.

ఈ కుంభకోణంలో సీతారాం, అరుణ్ అనే వ్యక్తులు కీలక నిందితులుగా ఉన్నట్లు ఈడీ పేర్కొంది. కొందరు అవినీతి అధికారులతో వీరు కుమ్మక్కై, ప్రభుత్వ స్థలాల్లో కూడా చట్టవిరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి, అమాయక ప్రజలకు విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు.

ఈ దర్యాప్తులో భాగంగానే వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగపు డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిందితుల ఇళ్ల నుంచి పెద్ద ఎత్తున నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ తమ ప్రకటనలో స్పష్టం చేసింది.

# టర్కీ కంపెనీకి భారత్ బిగ్ షాక్

విపరీతంగా ట్రెండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే మన దేశంలోని వివిధ ఎయిర్‌పోర్టుల్లో సేవలు అందించే టర్కీకి చెందిన కంపెనీపై వేటు వేయాలని ఇటీవల డిమాండ్లు వెల్లువెత్తగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లోని పలు విమానాశ్రయాల్లో భద్రతా పరమైన సేవలందిస్తున్న టర్కీ సంస్థ సెలెబి ఏవియేషన్‌కు సెక్యూరిటీ క్లియరెన్స్ రద్దు చేస్తూ తాజాగా కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) ఆదేశాలు ఇచ్చింది. ఇక ఈ సెలెబి ఏవియేషన్ సంస్థపై నిషేధం విధించాలని డిమాండ్లు వెల్లువెత్తిన వేళ కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు జమ్మూ కాశ్మీర్‌లో స్పందించారు. ఈ విషయంలో జాతీయ భద్రతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇది భద్రతాపరమైన విషయమని.. దీనిపై సంబంధిత ఏజెన్సీలతో మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పిన కొన్ని గంటల్లోనే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. టర్కీకి సెలెబి ఏవియేషన్ సంస్థ సెలెబీ ఎయిర్‌పోర్ట్స సర్వీసెస్ ఇండియా పేరుతో దేశంలోని పలు ఎయిర్‌పోర్టుల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ కార్యకలాపాలు చేపడుతోంది. సెలెబీ ఢిల్లీ కార్గో టెర్మినల్ మేనేజ్‌మెంట్ ఇండియా మాత్రం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కార్గో సేవలు అందిస్తోంది. గ్రౌండ్‌లో విమానాలకు నిర్దేశం చేసే ర్యాంప్ సర్వీసులు, విమాన సమతుల్యతను నిర్ధారించే లోడ్ కంట్రోల్, ప్రయాణికుల బోర్డింగ్‌కు అవసరమైన బ్రిడ్జిలను ఏర్పాటు చేయడం, కార్గో, పోస్టల్, గోదాంల నిర్వహణ వంటి కీలక కార్యకలాపాలను ఈ సంస్థ నిర్వహిస్తోంది. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా, పాకిస్తాన్‌కు మద్దతుగా టర్కీ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. పాకిస్తాన్‌కు క్షిపణులు, డ్రోన్లు అందించిన టర్కీ తీరుపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో టర్కీలో భూకంపం వచ్చినపుడు భారత్ ఆపరేషన్ దోస్త్ పేరుతో చేసి సహాయాన్ని మరిచిన ఆ దేశం మనకు మద్దతు ఇవ్వకపోవడం తీవ్ర దుమారానికి కారణం అయింది. దీంతో బాయ్‌కాట్ టర్కీ నినాదం వినిపిస్తోంది. ఇప్పటికే ట్రావెల్ ఏజెన్సీలు టర్కీకి బుకింగ్‌లు నిలిపివేయగా టూరిస్టులు కూడా తమ పర్యటనలు రద్దు చేసుకుంటున్నారు. భారత్‌లోని పలు యూనివర్సిటీలు టర్కీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకున్నాయి. టర్కీ నుంచి దిగుమతయ్యే వస్తువులను నిషేధించాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

# పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదంపైనే

భారత్ తిప్పికొట్టింది. పాక్ అణుస్థావరాలకు సమీపంలోని ఎయిర్ బేస్‌లపై భారత్ దాడి చేసి వాటిని ధ్వంసం చేసింది. ఇక భారత్‌తో పెట్టుకుంటే బతకలేమని అర్థం చేసుకున్న పాక్ కాళ్లబేరానికి వచ్చింది. కాల్పుల విరమణ పాటిద్దామని, చర్చలు జరుపుదామని వేడుకుంది. దీంతో భారత్ కాల్పుల విరమణ పాటిస్తోంది. అయితే ఆపరేషన్ సిందూర్‌కు ముందే భారత్ పలు దౌత్యపరమైన చర్యలు తీసుకుంది. అందులో ముఖ్యమైనది సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం. సింధూ నదీ జలాల ఒప్పందం యుద్ధానికి తీసిపోదని గుర్తించిన పాక్ భారత్‌ను వేడుకునే ప్రయత్నాలు మొదలు పెట్టింది. సింధూ నదీ జలాలు లేకపోతే, పాకిస్థాన్‌లో తీవ్ర ఆహార, ఆర్థిక సంక్షోభంలోకి జారుకుంటుంది. దీంతో సింధూ నదీ జలాలు ఇవ్వాలని, ఒప్పందాన్ని కొనసాగించాలని పాక్ వేడుకుంటోంది. అయితే పాక్‌తో సింధూ నదీ జలాలతో పాటు మరే ఇతర అంశాలపై చర్చలు జరిపే ప్రసక్తే లేదని, ఉగ్రవాదంపై, పీవోకేను తిరిగి భారత్‌కు అప్పగించడంపై మాత్రమే చర్చలు జరుగుతాయని మరోమారు స్పష్టం చేసింది. ఈమేరకు భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ భారత వైఖరిని పునరుద్ఘాటించారు. సరిహద్దు ఉగ్రవాదం సమస్య పరిష్కారం అయ్యే వరకు సింధూ నదీ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని అన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై జైశంకర్ మరోసారి మాట్లాడారు. పాక్ వద్ద ఉగ్రవాదుల జాబితా ఉందని, దానిని అప్పగించాల్సిన అవసరం ఉందని అన్నారు. పాకిస్థాన్‌తో సంబంధాలు, వ్యవహారాలు పూర్తిగా ద్వైపాక్షికంగా మాత్రమే ఉంటాయన్నారు. అందులో ఎటువంటి మార్పు లేదని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదంపై మాత్రమే ఉంటాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంగా చెప్పారని జైశంకర్ గుర్తు చేశారు. "పాకిస్థాన్ వద్ద ఉగ్రవాదుల జాబితా ఉంది. వారిని అప్పగించాలి. అలాగే ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలను నిర్వీర్యం చేయాలి. ఉగ్రవాదం గురించి ఏం చేయాలో వారితో చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఆ చర్యలు సాధ్యమే" అని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు.

# మధ్యవర్తిత్వంపై ట్రంప్ యూటర్న్

ఆరోజు నుంచి ఈరోజు వరకు పదే పదే ఈ క్రెడిట్ అంతా తనకే దక్కుతుందంటూ చెప్పుకొచ్చారు. కానీ తాజాగా ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు. మధ్యవర్తిత్వంపై మాట మార్చారు. తానే దగ్గరుండి ఒప్పందం కుదర్చలేదని అన్నారు. కానీ సాయం మాత్రం చేశానంటూ వివరించారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి అందరికీ తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ దాయాది దేశానికి చుక్కలు చూపించింది. ఓవైపు దౌత్యపరంగా చర్యలు తీసుకుంటూనే మరోవైపు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలపై క్షిపణి దాడులు చేసింది. దీంతో పాక్ సైతం భారత్‌పై ప్రతిదాడులకు పాల్పడింది. పౌర, సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్ దాడులు చేసింది. ఇలా ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగగా మే 10వ తేదీ రోజు రెండు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించాయి. అయితే ఈ విషయాన్ని ప్రకటించడానికి ముందే ఆమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ విషయాన్ని ప్రకటించారు. దీంతో అందరూ ట్రంప్‌యే పెద్దన్న బాధ్యత వహించి ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిర్చి ఉంటారని అంతా అనుకున్నారు. ఇందుకు తగ్గట్లుగానే ట్రంప్ కూడా తానే మధ్య వర్తిత్వం చేసినట్లు ప్రకటించారు. గత ఐదు రోజుల్లో మూడు, నాలుగు సార్లు దీని గురించి మాట్లాడుతూ తనకే ఈ క్రెడిట్ అంతా దక్కుతుందని అన్నారు. కానీ దీనిపై భారత్ కూడా పలు మార్లు స్పందించింది. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం విషయంలో ఎవరి మధ్యవర్తిత్వం లేదని తేల్చి చెప్పింది. ఇరు దేశాల జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ కలిసి తమకు తాముగా ఓ అవగాహనకు వచ్చినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అయినప్పటికీ ట్రంప్ గురువారం రోజు ఎక్స్ వేదికగా తానే మధ్యవర్తిత్వం కుదిర్చినట్లు మరోసారి వెల్లడించారు. కానీ ఈరోజు మాత్రం తన వైకరి మార్చుకున్నారు. యూటర్న్ తీసుకుని మరీ.. తానే భారత్-పాక్ దేశాల మధ్య ఒప్పందం కుదిర్చానని చెప్పాలనుకోవడం లేదని, ఇరు దేశాలు సమస్యను పరిష్కరించుకోవడానికి తాను సాయం చేశానని అన్నారు. ఇక రెండు దేశాల మధ్య సమస్య పరిష్కారం అయిందని తాను భావిస్తున్నట్లు వెల్లడించారు. యుద్ధం ఆపేసి వాణిజ్యం చేద్దాం రమ్మని పిలిచానని అందుకు ఆ దేశాలు కూడా అంగీకరించి ఇప్పుడు సంతోషంగా ఉన్నాయని భావిస్తున్నట్లు స్పష్టం చేశారు.

# లక్ష్మీ నరసింహస్వామిని సేవలో ప్రపంచ సుందరీమణులు

ఆలయ పూజారులతో ఆశీర్వచనం తీసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ శిల్పకళకు ముగ్ధులైన మోడల్స్ ఆలయ శిల్పకళా సంపద కనపడేలా ఫోటోలు దిగారు. అఖండ దీపారాధన మండపంలో జరిగిన జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి (ఏఈవో) భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సుందరీమణుల పర్యటన సందర్భంగా అక్టోపస్, తెలంగాణ స్పెషల్ పోలీస్ దళాలు, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### - పోచంపల్లిలో ఇక్కత్ కళావైభవం

మరోవైపు, టూరిజం విలేజ్‌గా ప్రసిద్ధి చెందిన పోచంపల్లిని ఆఫ్రికా ఖండంలోని 25 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. గ్రామానికి విచ్చేసిన ఈ విదేశీ అతిథులకు స్థానిక ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఇక్కత్ చీరల విశిష్టతను, వాటి తయారీ విధానాన్ని సుందరీమణులు ఆసక్తిగా పరిశీలించారు. అంతేకాకుండా, కొందరు పోటీదారులు స్వయంగా మగ్గంపై చీరలు నేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ పర్యటన ద్వారా పోచంపల్లి చేనేత కళ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది.

# సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

**హైదరాబాద్** ఘనంగా కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలను ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించారు. త్రివేణి సంగమంలో మధనానంద సరస్వతి స్వామివారు తొలి స్నానం ఆచరించారు. పుణ్య స్నానాల కోసం కాళేశ్వరానికి భక్తులు భారీగా చేరుకున్నారు. గురువారం ప్రారంభమై 12 రోజులపాటు (26 వ తేదీ) సరస్వతీ పుష్కరాలు కొనసాగునున్నాయి..



## పేదలకు సేవా మార్గంలో వైద్యం అందించాలి

**ట్రాఫిక్ బారికేడ్లను ప్రారంభించిన డిఎస్పీ రెహమాన్**

**20బారికేడ్లను అందించిన ఆదిత్య న్యూరో గ్యాస్ట్రో ఆసుపత్రి**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) సేవా మార్గంలో పేదలకు సామాన్య ప్రజలకు వైద్యాన్ని అందించాలని కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ అన్నారు. గురువారం కొత్తగూడెంలోని ఆదిత్య న్యూరో అండ్ గ్యాస్ట్రో ఆసుపత్రి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ కొత్తగూడెం వారికి 20 బారికేడ్లను అందజేశారు. ఈ బారికేట్లను డిఎస్పి అబ్దుల్ రెహమాన్ ప్రారంభించి కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులకు అందించారు. అనంతరం ఆయన ఆదిత్య న్యూరో అండ్ గ్యాస్ట్రో విభాగాలకు సంబంధించిన ప్రముఖ డాక్టర్లు దేవి రెడ్డి ప్రసూన డాక్టర్ షిండే లను అభినందించారు. న్యూరో మరియు గ్యాస్ట్రో విభాగాలకు సంబంధించి పూర్తి సమయం ఉండే డాక్టర్లు కొత్తగూడెంలో అందుబాటులో ఉండడం విశేషమని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చుట్టుపక్కల ప్రాంతాలు ఏజెన్సీ ప్రాంతాలు కావున పేదలు ఎక్కువగా ఉంటారు వారందరికీ అందుబాటులో ఉండే విధంగా వైద్యాన్ని అందించాలని యాజమాన్యాన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ , హాస్పిటల్ యాజమాన్యం మారుతి, మణి, సతీష్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో రాష్ట్ర మంత్రుల పర్యటనకు

# పటిష్ట భద్రత ఏర్పాట్లు

**– జిల్లా ఎస్పీ: మహేష్ బి. గితే**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం,రుద్రంగి మండలంలో నేడు శుక్రవారం జరిగే తెలంగాణ రాష్ట్ర మంత్రుల బృందం పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టింది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, భద్రతా చర్యలపై వివరంగా దిశానిర్దేశం చేశారు. ఈ



సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "మంత్రుల పర్యటన నేపథ్యంలో సభ ప్రాంగణం, విఐపి/జనరల్ గ్యాలరీలు, రూట్ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలలో భద్రతను గట్టిగా అమలు చేయాలి. బందోబస్తులో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి," అని సూచించారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీ కృష్ణ, డిసిఆర్బీ డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, సర్కిల్ ఇన్స్పెక్టర్లు మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, మధుకర్, నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు రమేష్, మధుకర్ పాల్గొన్నారు.

## మహిళా సంఘాల ద్వారా వృద్ధాశ్రమం నిర్వహణ



**పెద్దపల్లి** మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా పెద్దపల్లి జిల్లాలో వృద్ధాశ్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరెట్ లో వృద్ధాశ్రమం నిర్వహణ అవగాహన ఒప్పందం కుదుర్చుకునే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహిళా సంఘాలు పొదుపు తదితర విషయాలే కాకుండా సామాజిక సేవకు ముందుకు రావడం ఎంతో సంతోషకరమై న విషయమని జిల్లా కలెక్టర్ అన్నారు. పెద్దపల్లి జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం 70 లక్షల రూపాయల ఖర్చుతో వృద్ధాశ్రమాన్ని నిర్మించామని ఆయన తెలిపారు. వృద్ధాశ్రమంలో నిరాదరణలో ఉన్న 50 వయోవృద్ధులు మందికి ఆశ్రయం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఈ ఆశ్రమాన్ని నిర్వహించటానికి జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల నుండి దరఖాస్తులు కోరగా అర్హతగల సంస్థలు ఏవీ రాకపోవడంతో జిల్లా మహిళా సమాఖ్య వారికి ఈ బాధ్యత ను అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు. వృద్ధాశ్రమాన్ని నిర్వహించడమే కాకుండా సంవత్సరానికి సుమారు ఆరు లక్షలు వృద్ధుల కోసం మహిళా సంఘం ఖర్చు చేయడానికి ముందుకు రావడం వారి సామాజిక బాధ్యతను గుర్తు చేస్తుందని కలెక్టర్ అన్నారు. అనంతరం వృద్ధాశ్రమం నిర్వహణ విషయమై జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాలరావుతో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు స్నేహ కార్యదర్శి శోభ, కోశాధికారి స్వప్న అవగాహన ఒప్పందం పై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల రాయితీ రుణాలకు బ్రేక్

**- రుణాలు నిలుపుదల చేస్తూ ప్రభుత్వ ఆదేశాలు**

**- రుణాల మంజూరుపై వెల్లువెత్తిన విమర్శలు**

**- భారీగా దళారుల రంగప్రవేశం**

**- రాజకీయ సిఫార్సు లేనివారికి మొండి చేయి**

ఇబ్రహీంపట్నం (ప్రశ్న న్యూస్) బీసీ కార్పొరేషన్, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదా రులకు రాయితీ మీద మంజూరు చేయాలనుకున్న రుణాలను నిలుపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా కేంద్రానికి సమాచారం అందింది. రాయితీ రుణాల మంజూరుపైన విమర్శలు వెల్లువెత్తాయి. శాసనసభ్యులు చెప్పిన వారికి మాత్రమే రుణాలు మంజూరు చేసే పరిస్థితి ఏర్పడింది. రుణాల మంజూరును ప్రజాప్రతినిధులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎవరెవరికి రుణాలు మంజూరు చేయా లో ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులకు జాబి తాలు అందజేశారు. రాయితీ రుణాలు ఇప్పిస్తామనిమ ధ్యలో దళారులు కూడా రంగ ప్రవేశం చేశారు. దీంతో సామాన్య ప్రజలకు రాయితీ రుణాలు అందని ద్రాక్షగా మి గిలాయి. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి అందిన ఫిర్యాదుల ఆధారంగా రాయితీ రుణాలను తాత్కాలికం గా నిలబదలు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆరు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్టీ, ఎస్సీలకు రాయితీ రుణాలను ప్రకటిం చింది. దీంతో లబ్ధిదారులు ఎలాగైనా బీసీ, ఎస్సీ కార్పొ రేషన్ రుణాలు దక్కించుకొని జీవితంలో స్థిరపడవచ్చ ని ఆశపడ్డారు. దీంతోఈ రుణాలకు భారీగా దరఖాస్తులు రావడంతో దరఖాస్తుదారులు రాజకీయ నాయకులను ఆశ్రయించారు. కొందరు ఎలాగైనా రుణాన్ని సాధించా లని మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. ఈ రాయితీ రు ణాలను జిల్లా అధికారులు నియోజకవర్గ మండలలా వారీగా విభజించారు. ఆ జాబితా ఆయా శాసనసభ్య లకు అందజేశారు. దీంతో శాసనసభ్యులు ప్రతిపాదిం చిన వారికి రుణాలు ఇవ్వాలని అధికారులను ఆదేశిం చారు. దీంతో ఆశావాహులు పలువురు శాసనసభ్యుల ను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. మరికొందరు మండల స్థాయిలోని కూటమి నేతల సహకారాలను తీ సుకొని శాసనసభ్యులను ఒప్పించడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇదే అదునుగా మండల స్థాయిలో కూట మి నేతలు దరఖాస్తుదారులకు హామీల వర్షం కురిపిస్తు న్నారు. అయితే ఇందులో కొంత ఖర్చవుతుందని, పది శాతం వరకు భరించాల్సి ఉంటుందని షరతు పెడుతు న్నారు. ఇదే అదునుగా కొంతమంది బీసీ నాయకులు కూడా దళారుల అవతారం ఎత్తుతున్నారు. కొంతమం ది కులసంఘ నాయకులతో కలిసి దరఖాస్తుదారులకు వల విసురుతున్నారు. కొందరు లబ్ధిదారుల నుంచి ముందుగానే డబ్బులను వసూలు చేస్తున్నారు. గతం లో ఎంబీసీ కార్పొరేషన్ తరపున ఒక్కొక్కకుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 వేలను ఆర్థిక సహాయం అంద జేసింది. ఇందులో కూడా కొంతమంది దళారులు రంగ ప్రవేశం చేసి, తామే డబ్బులు మంజూరు చేపిమ్చుమని, ఒక్కొక్క లబ్ధిదారు దగ్గర రూ.3000 నుంచి రూ.5000 వరకు వసూలు చేసిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తు తం బీసీ రాయితీ రుణాలకు డిమాండ్ ఏర్పడింది. దీం తోదళారీలు రంగ ప్రవేశం చేశారు. అయితే బీసి కార్పొ రేషన్ సబ్సిడీ రుణాల కోసం ఆన్ లైన్ లో దరఖాస్తులను స్వీకరణ పూర్తి అయ్యింది. అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తులు భారీగా రావడంతో జిల్లా అధికారుల నుండి ఎంపిక బాధ్యతలను ఎమ్మెల్యేలుతీ సుకున్నారు. మండల, నియోజకవర్గ వారీగా ప్రభు త్వం మంజూరు చేసిన యూనిట్లను విభజించారు. ఈ మేరకు జాబితాలను ఎమ్మెల్యేలు మండల అధికారుల కు, మున్సిపాలిటీలకు అందచేశారు. ఎమ్మెల్యేలు ప్రతి పాదించిన వారికి మాత్రమే సబ్సిడీ రుణాలు అందచే యాలని అధికారులు కూడా బ్యాంకులను ఆదేశించారు. ఈ మేరకు జాబితా అందచేశారు. జిల్లాకు 2800 యూనిట్లు మాత్రమే బీసీ రుణాలు మంజూరయ్యాయి. త్వం రూ.30.62 కోట్లు సబ్సిడీగా అందజేస్తుంది. ఎన్టీఆర్,జిల్లాలో ఎస్సీల ఆర్థికాభివృద్ధికి రూ.27.43 కోట్లతో వార్షిక ప్రణాళికను రూపొందించారు. ఇందులో కార్పొ రేషన్ సబ్సిడీగా రూ.12.52 కోట్లు అందజేస్తుంది. బ్యాంకర్లు రుణాల కింద మరో 13.53 కోట్లను సమకూ ర్చుతాయి. లబ్ధిదారులు తమ వాటాగా రూ.1.37 కోట్లు చెల్లించాల్చి ఉంటుంది. ఈ ప్రణాళిక కారణంగా జిల్లా లోని 786 మంది ఎస్సీలు లబ్ధి పొందనున్నారు. గతం లో లేని విధంగా భారీగా సబ్సిడీ వస్తుండటంతో దర అవి కూడా బీసీ కార్పొరేషన్, బ్రాహ్మణ కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్, కమ్మ కార్పొరేషన్, క్షత్రియ కార్పొరేషన్, రెడ్డి కార్పొరేషన్, వైశ్య కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ల కింద ఈపథకాలకు మంజూరు చేశారు. ఈ పథకాల విలువ రూ.61.25 కోట్లకాగా, ఇందులో ప్రభు ఖాస్తుదారులు కూడా భారీగా ఆశలు పెంచుకున్నారు. బిసి కార్పొరేషన్ ద్వారా స్లాబ్ 1లో రూ. రెండు లక్షల వరకు స్లాబ్ 2 లోరూ. 3 లక్షల వరకు, స్లాబ్ 3 లో రూ.5 లక్షల వరకు, స్లాబ్4లో ఎనిమిది లక్షల నుంచి 25 లక్షలు వరకు సబ్సిడీ వస్తుంది. జిల్లాలో బీసీల ఆర్థికాభివృద్ధికి రూ.38.41 కోట్ల ప్రణాళికను రూపొందించారు. ఈ ప్ర ణాళిక కారణంగా జిల్లాలోని 2020 మంది బీసీలు లబ్ధి పొందనున్నారు. ఇందులో సబ్సిడీగా రూ.19.20కోట్లు అందచేస్తుంది. ఇలాజిల్లాస్థాయిలో బిసి, ఎస్సిరాయితీ రుణాల కోసం పలువురు ఆశలు పెట్టుకున్నారు. ఇదే అ దనుగా దరఖాస్తుదారుల నుండి కమీషన్లు దండుకొని లబ్ధి పొందాలని కొందరు బిసి, కూటమి నేతలు ప్రయ త్నాలు చేశారు. ఈ విషయాలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ప్రస్తుతం రాయితీ రుణాలను మంజూరు చే యడం ప్రభుత్వానికి మంచిది కాదని భావించింది. ఇలాచేయడం వల్లసామాన్యలబ్ధిదారులకు రుణాలు అం దేపరిస్థితి లేదని అంచనాకు ప్రభుత్వాధికారులు వచ్చా రు. రాయితీ రుణాలను రాజకీయ నాయకుల సిఫార్సు లతో కూటమి నేతలు పంచుకునే పరిస్థితి ఏర్పడిందని భావించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని నివే దికలు అందాయి. క్షేత్రస్థాయిలో జరిగిన, జరుగుతున్న విధానాన్ని పరిశీలించిన ప్రభుత్వం రాయితీ రుణాలను తాత్కాలికంగా నిలిపివేస్తు నిర్ణయం తీసుకుంది. కొత్త నిబంధనలను జారీచేసి, తదుపరి బీసీ, ఎస్సీరుణాలను అందజేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# తెలంగాణ బీడీ కార్మికుల కోరికలపై గళమెత్తిన నేతలు

**- వేములవాడలో బీడీ వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశం**

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి : కడారి రాములు**





వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని గుమ్మి పుల్లయ్య భవనంలో గురువారం తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశం జరగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు బి.గోవర్ధన్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ, బీడీ కార్మికులకు ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) ద్వారా కనీస పెన్షన్ రూ.6,000 ఇవ్వాలని, అన్ని జిల్లాల్లో ఈ.ఎస్.ఐ. ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్యాకర్లు, షేకర్లకే పరిమితమైన ఈ.ఎస్.ఐ. సదుపాయం జిల్లాలో అందుబాటులో లేకపోవడంతో, కార్మికులు ఎక్కడికి వెళ్లాలో, ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉందని తెలిపారు. వర్ది బీడీ లేకుండా అన్ని విభాగాల్లో పనిచేసే కార్మికులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, నెలకు కనీసం 24 రోజులు పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు.అనంతరం మే 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమ్మెలో పాల్గొనాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని, కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు,ముక్రం,అజ్జ వేణు,తోట భిక్షపతి,కొక్కుల శాంత,కె.వి. అనసూయ, వెన్న మహేష్, అయ్యవారు లక్ష్మన్,ఆది రంగారెడ్డి, ఎన్. బాలాగౌడ్, కె. పార్వతి, ఎస్. శాంత తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల ఏరివేత



**హైదరాబాద్ :** తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యల్లో నిజముంది. ఎందుకంటే రెండు రాష్ట్రాల్లో పథకాలను పొందుతూ, రెండు రాష్ట్రాల రేషన్ కార్డులు ఉన్న వారు అనేక మంది ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చి స్థిరపడినా అక్కడ సొంత ఇల్లు.. ఇక్కడ ఉపాధి కోసం వచ్చిన వారు రెండు చోట్ల రేషన్ కార్డులు తీసుకుంటున్నారు. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అందించే పథకాలు అందుకుంటున్నారు. నిజంగా ఇది దురదృష్టకరమే. ప్రజాధనం పక్కదోవపట్టడమే అవుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. దీనిపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సీరియస్ గా తీసుకుని కేవలం ఒక రాష్ట్రంలోనే రేషన్ కార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఉచిత పథకాలు అందాలన్నారు. అప్పుడే ప్రభుత్వ పథకాలకు సార్థకత చేకూరతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే బియ్యం అమ్ముకునే వారికి ఎందుకు ఇవ్వాలని ఆయన వేసిన ప్రశ్నలో కూడా అర్థం ఉంది. తెలంగాణలో కోటి పది లక్షల కుటుంబలు ఉంటే పొరుగు రాష్ట్రానికి చెందని వారికి కూడా ఇక్కడ రేషన్ కార్డులన్నాయన్నారు. దీనివల్ల అక్కడా, ఇక్కడా బియ్యం తీసుకోవడంతో అవి పక్కదారి పట్టే అవకాశముంది. అదే సమయంలో రెండు చోట్ల పథకాలను అందుకుంటుంటే ప్రభుత్వ ఖజానాపై కూడా భారం పడే అవకాశముంటుంది. ఒకరు ఒక రాష్ట్రంలోనే సంక్షేమ పథకాలను పేదలు అందుకోవాల్సి ఉంటుందికానీ అర్హతలులేని వారు కూడా అనేక మంది ఉచితాలు పొందుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది.ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో రెండుచోట్ల రెండు ఓట్లు ఉన్నాయి. వేర్వేరు సార్లు ఎన్నికలు జరుగుతుండటంతో అక్కడకు వెళ్లి ఓటేస్తారు. ఇక్కడా తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఎన్నికల కమిషన్ ఒకే రాష్ట్రంలో ఒకేచోట మాత్రమే ఓటు హక్కు ఉండాలన్ననిబంధన పెట్టింది. ఇప్పుడు అలాగే పథకాలను కూడా ఎక్కడో ఒకచోట మాత్రమే తీసుకునే అవకాశం కల్పిస్తే నిజమైన పేదలకు పథకాలు అందుతాయి. ప్రభుత్వాలకు కూడా కొంత వెసులుబాటు లభిస్తుందని భావిస్తున్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ గా తీసుకుని విచారణ జరపాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండేలా చర్యలు తీసుకుంటే చాలా వరకూ ఖజానా పై భారం తగ్గుతుందని ఉన్నతాధికారులు కూడా చెబుతున్నారు.

## గులాబీలో

# కుర్చీలాట

**హైదరాబాద్ :** భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ చీలిక ముంగిట నిలిచిందా? ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు.. తన వారసుడి ప్రకటనకు ముహూర్తం పెట్టేసి రాజకీయ విరమణ లేదా రాజకీయ సన్యాసానికి రంగం సిద్ధం చేసేసుకున్నారా? అంటే బీఆర్ఎస్ లో గత కొన్ని రోజులుగా వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే ఔనన్న సమాధానమే వస్తున్నది. గత కొంత కాలంగా ఒక పద్ధతి ప్రకారం పార్టీలో హరీష్ రావు ప్రాధాన్యత తగ్గుతూ లేదా తగ్గిస్తూ వస్తున్న తీరు, అలాగే ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, పార్టీ అధినేత కుమార్తె కల్వకుంట్ల కవిత పార్టీ లైన్ కు భిన్నంగా చేస్తున్న వ్యాఖ్యలు గమనిస్తే.. పార్టీ పగ్గాల విషయంలో బీఆర్ఎస్ లో మూడు కుర్చీలాట జోరుగా సాగుతున్నదని పరిశీలకులు అంటున్నారు.2023 ఎన్నికలలో బిఆర్ఎస్ పరాజయం తరువాత నుంచీ ఆ పార్టీ అధినేత కేసీఆర్ పొలిటికల్ గా ఏమంత యాక్టివ్ గా లేరు. ఇంత కాలం ఆయన రాజకీయాల నుంచి తాత్కాలిక విరామం మాత్రమే తీసుకున్నారని అంతా భావిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడిప్పుడే పార్టీ వర్గాలలో కూడా ఆయన తీసుకున్నది తాత్కాలిక విరామం కాదనీ,రాజకీయ విరమణేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు పూర్తిగా పగ్గాలు అప్పగించేయడమే తరువాయి అన్న వార్తలు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అందుకు అనుగుణంగా కేసీఆర్ నెమ్మదిగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. అందులో భాగంగానే ఇటీవల వరంగల్ వేదికగా జరిగిన పార్టీ పాతికేళ్ల సభలో హరీష్ రావు ప్రస్తావన, ప్రాముఖ్యత ఇసుమంతైనా లేకుండా అంతా కేటీఆరే అన్నట్లుగా నిర్వహించారంటున్నారు. అదే సమయంలో విషయాన్ని గుర్తించిన హరీష్ రావు తన దారి తాను చూసుకునేందుకు నిర్ణయించుకున్నారన్న వార్తలూ జోరుగా వినిపించాయి. అదే సమయంలో కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత కూడా తన సంగతేంటంటూ గొంతెత్తుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా ఆమె రామానుజపురంలో నాంచారమ్మ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోది చెప్పే నాంచారమ్మలు కవిత భవిష్యత్ లో తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. వారి మాటలను చిరునగవుతో విన్న కవిత జై తెలంగాణ అంటూ నినదించారు. ఈ సంఘటన యథాలాపంగా జరిగింది కాదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఆమె సామాజిక తెలంగాణ సాధన ఇంకా మిగిలే ఉందంటూ చేసిన వ్యాఖ్యకు దీనిని జోడించి సొంత సోదరుడు కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నారంటున్నారు. అది పక్కన పెడితే.. సందర్భంతో సంబంధం లేకుండా తాను కేసీఆర్ ఎవరికి పగ్గాలు అప్పగించినా స్వాగతిస్తానంటూ హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను కూడా ఆయనలోని అసంతృప్తికి,అసహనానికీ తార్కాణంగా చెబుతున్నారు. అదే సమయంలో హరీష్ పార్టీ తదుపరి అధ్యక్షుడి విషయం లేవనెత్తడాన్ని కేసీఆర్ పొలిటికల్ రిటైర్మెంట్ కు రెడీ అయిపోయారన్న సంకేతాన్ని ఇవ్వడమేనని చెబుతున్నారు.పార్టీ శాసనసభా పక్ష నేతగా కేటీఆర్ అంగీకరించని పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు.. ఇప్పుడు ఏకంగా పార్టీ అధ్యక్ష పగ్గాలనే అప్పగిస్తానని కేసీఆర్ అంటే అంగీకరిస్తారా అన్న అనుమానాలూ సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.పార్టీ అధినేతగా కేసీఆర్ ఉన్నంత వరకూ ఆయన అభిప్రాయాన్ని కాదని ఎవరూ అనరు కానీ, ఒక సారి ఆయన ఆ స్థానం నుంచి తప్పుకుంటే మాత్రం కేసీఆర్ మాట ఇక పార్టీలో ఎంత మాత్రం శిలాశాసనం అన్న పరిస్థితి ఉండదని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పరిశీలకులు బీఆర్ఎస్ చీలిక అంచున ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులుగా క్యాతం కుమార్



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులుగా రెండవ సారి క్యాతం కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మంథని లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నూక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చింతపండు రాజు, కోశాధికారిగా కనుకుంట్ల పురుషోత్తం, అడిషనల్ సెక్రటరీగా ఆరే కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అరకాల కోటేశ్వర్,సలహాదారుగా ఎం. శ్రీనివాస్ ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు జిల్లా క్రిమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మామిడి వినోద్ కుమార్,ప్రధాన కార్యదర్శి రాజేందర్, కోశాధికారి సతీష్ ల నేతృత్వంలో జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన మందులను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించరాదని. డూప్లికేట్ మందుల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. వ్యాపార పరమైన సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే జిల్లా యూనియన్ వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్, మెడికల్ దుకాణాల యజమానులు జె ఎస్ రెడ్డి. ఇల్లందుల రాము, ముత్తారం, రామగిరి, కమాన్ పూర్ మండలాల కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు జిల్లా యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర అధికార కాంగ్రెస్ పార్టీలో నికాసైన కార్యకర్తలకు నిరాశ బి1 నిస్పృహ.

### పార్టీ మారిన కార్యకర్తలని అందలేమెక్కిస్తున్న మంత్రి.

మంథని ( ప్రశ్న న్యూస్) అధికార కాంగ్రెస్ పార్టీ అదో పాతాళానికి వెళ్ళినప్పుడు నీతి, నిజాయితీ గల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వెన్ను దన్నుగా ఉండి కాంగ్రెస్ పార్టీని బుజస్కందాల మీద వేసుకొని నాయకుడిని గెలిపించడానికి అహర్నిశలు కష్టపడిన పార్టీ బలోపేతానికి సా య శక్తుల కృషిచేసి గెలిపించడానికి వారి వంతు సహకారం ఎంతో ఉంటుంది ప్రజా పాలన చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నికాసైన కార్యకర్తలను విస్మరించింది. కార్యకర్తలకు తగిన గుర్తింపు లేకుండా రాజకీయాలు చేస్తూ అందలమెక్కిస్తున్నది. ఎవరికి వారే యమునా తీరంగా వ్యవహరిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడిప్పుడే చేర్చుకున్న నాయకులకు శ్రీపాదరావు ఉన్నప్పటినుండి కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేసిన నాయకులను గుర్తించకుండా తస్సారం చేస్తూ గ్రూపు రాజకీయాలకు, జోకుడు వ్యవస్థకు ఉన్నవారికే పదవులను కట్టబెడుతున్నారు. ఇకనుండి అయినా నిజాయితీ, నికాసైన నాయకులకు పదవులను ఇవ్వకపోతే రాబోయే ఎలక్షన్లలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని పార్టీ కార్యకర్తల్ నిరుత్సాహపడుతున్నారు. ఇకనుండి అయినా గ్రూపు తగాదాలకు స్వస్తి పలికి ఎవరైనా గట్టిగా మాట్లాడితే వారికి వ్యతిరేకంగా ఒక గ్రూపును తయారుచేసి గొడవలు సృష్టిస్తూ మంత్రి కాలం వెళ్లబుచ్చుతున్నారు. నియోజకవర్గం సర్వతోముక అభివృద్ధిలో నడవాలంటే కార్యకర్తలను కాపాడుకొని సమాజ సేవ చేసే అవకాశం కల్పించాలని కార్యకర్తలు కోరుచున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లు దేవస్థాన చైర్మన్లు నికాసైన కార్యకర్తలకు ఇచ్చి నామినేట్ పదవులను భర్తీ చేయాలని కార్యకర్తలు తెలియజేస్తున్నారు. అధికారం వస్తే ఒకలాగా రాకుంటే ఒకలాగా ఉండకూడదని కార్యకర్తలు ఆశతో ఎదురుచూస్తున్నారు. నిప్పుల మీద నీళ్లు చల్లినట్టుగా వ్యవహరిస్తూ మంత్రి తెలిసి చేస్తున్నారా? లేదా తెలువక చేస్తున్నారా? అందరూ ప్రజ ప్రజలు గమనిస్తున్నారు .ఇకనుంచి అయినా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వాలు కార్యకర్తలను ఎన్నో ఇబ్బందుల గురిచేసిన పార్టీలు మారకుండా నాయకుని కోసమే వెన్ను విరుచుకొని నిలబడి పార్టీ గెలవడానికి ఉపయోగపడిన కార్యకర్తలను నాయకుడు కాపాడుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వాల మోసాలను అన్యాయాలను, అధర్మాలను ప్రజల్లో ఎండగట్టి జైలుకు వెళ్లి కేసుల అనుభవించి ప్రజల్లోకి తిరుగు వచ్చి కాంగ్రెస్ పార్టీ కోసం ప్రాణాలను అడ్డుపెట్టి త్యాగాధుల పునాదులు మీద పార్టీని గెలిపించిన కార్యకర్తలను కాపాడుకోన్నీ పార్టీ మారిన నాయకులకు అందలమెక్కించి వారికి పదవులు కట్టబెడితే మొదటి నుంచి కష్టపడ్డ కార్యకర్తలు కళ్ళలో నీళ్లు తిరుగుతున్నాయి .ఇదంతా మంత్రిగమనించాలని కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకోవాలని వారిని వెన్ను దట్టి ఉండి కాపాడుకోవాలని పార్టీ కార్యకర్తలు విన్నపం చేస్తున్నారు. ఇటీవలే



తెలంగాణ రాష్ట్రానికి పార్టీ వ్యవహారాల ఇన్చార్జిగా వచ్చిన మీనాక్షి నటరాజన్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి అని నాయకులకు హెచ్చరికలు జారీ చేసింది .ఇదంతా గమనించాలని ప్రజలు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ కార్యకర్తలకు ఒక బూస్ట్ లాగా తయారయ్యారని. కార్యకర్తలు ఆనందంలో ఉన్నారు. ముఖ్యమంత్రి మాటలను పేడిశవున పెట్టి నాయకులు కార్యకర్తలకు అదో పాతాళానికి తొక్కుతున్నారు ఇకనుండి అయినా ప్రజలు అన్ని గమనించి నాయకులకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారు. ప్రజలు తెలియజేస్తున్నారు.

## అమెరికాలో తైక్వాండో క్రీడలో రానిస్తున్న మంథని వాసి

**- ఒలంపిక్స్ లో పాల్గొనడమే నా లక్ష్యం**

**- తైక్వాండో క్రీడాకారిణి వరహాల ఆరిణి**



మంథని ( ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ క్రీడల్లో మంచి పేరున్న తైక్వాండో క్రీడలో అమెరికాలోని నార్త్ కరోనియాలో స్థిరపడిన మంథని వాసి వరహాల ఆరిణి మంచి గుర్తింపు సాధించడం విశేషం. ఈ క్రీడ దక్షిణ కొరియాలో ఎంతో ప్రాముఖ్యత సాధించి నేడు ప్రపంచ క్రీడల్లో ఎందరో క్రీడాకారులను ఆకర్షిస్తున్న క్రీడగా ఇది ఒలింపిక్స్ లో కూడా ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా వరహాల ఆరిణి మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి తైక్వాండో నేర్చుకుంటున్నానని, తైక్వాండో శరీరానికి చాలా మంచిదని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కర్రసాము ఎంత ముఖ్యమైనదో క్రీడనో, ఇతర దేశాలలో మార్షల్ ఆర్ట్స్ అంతే ముఖ్యమైన క్రీడా అని ఆమె పేర్కొన్నారు. తైక్వాండో చేస్తే మన శరీరం ఆరోగ్యంగా ఉంటుందని తైక్వాండో అన్నది ఒక ఒలింపిక్ స్పోర్ట్ ఈవెంట్ గా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. చాలా సేపు కూర్చుంటే, కాళ్ళకు మంచిది కాదని అందుకే తైక్వాండో చేస్తే మన వివిధ శరీర భాగాలకు మంచిదని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. తైక్వాండో దక్షిణ కొరియాలో పుట్టిన క్రీడ అని నేను ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు కలిగిందని ఆమె వెల్లడించారు. తైక్వాండో లో మాకు కిక్స్, పంచెస్, పుమ్సె లతో పాటు మాకు రోజు వ్యాయామాలు చేయిస్తున్నారని ఆమె తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి తైక్వాండో నేర్చుకుంటున్నానని తైక్వాండో శరీరానికి, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఆమె తెలిపారు. తైక్వాండో చేస్తే మన శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. తైక్వాండో లో కిక్స్, పంచెస్, పుమ్సె లతో పాటు మాకు రోజు వ్యాయామాలలో పూర్తిస్థాయి శిక్షణ పొందుతున్నానన్నారు. ఇంకా ఈ క్రీడలో ఎన్నో నైపుణ్యాలను పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన తర్వాత ఒలింపిక్స్ లో పాల్గొనే ఆకాంక్ష ను ఆమె వ్యక్తం చేశారు. ఆరిణి క్రీడల్లో మంచి పేరు పెట్టదు తీసుకురావాలని ఈ ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

### ఐఎఫ్డబ్ల్యూజె జాతీయ అధ్యక్షుడు కోటంరాజు విక్రమ్ రావు మృతి పట్ల వేములవాడ టి.డబ్ల్యు.జె.ఎఫ్. సంతాపం



వేములవాడ,(ప్రశ్న న్యూస్) ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐ.ఎఫ్.డబ్ల్యు.జె.) జాతీయ అధ్యక్షుడు కోటంరాజు విక్రమ్ రావు ఇటీవల లక్నోలో కన్నుమూశారు. ఈ వార్తతో జర్నలిజం రంగంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మృతి పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వేములవాడ నియోజకవర్గ యూనియన్ తరఫున అధ్యక్షుడు తొగరి కరుణాకర్ ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ, “విక్రమ్ రావు మృతి జర్నలిస్ట్ సమాజానికి తీరనిలోటు. ఆయన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయి,” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుంకరి నరేందర్, కోశాధికారి బొప్ప భిక్షపతి, ఉపాధ్యక్షులు కవ్వల సురేందర్, ఎం.ఏ. రఫిక్, సయ్యద్ షబ్బీర్, సభ్యులు కళ్యాడపు వెంకటమల్లు, నిమ్మశెట్టి రాజు, గోపు ప్రవీణ్, చిర్రం ప్రసాద్, నడకట్ల మధు, పొలాస సంతోష్, కీర్తి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**- అనుమతి లేకుండా ఇసుక రవాణా - డ్రైవర్ అరెస్టు, ట్రాక్టర్ స్వాధీనం**

**- బోయినిపల్లి ప్రొబేషనరీ సబ్ ఇన్స్పెక్టర్ : అనిల్ కుమార్**



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కోరెం గ్రామ శివారులో గురువారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌లు పట్టుకున్నారు. గురువారం మధ్యాహ్నం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కొండపోచమ్మ శివారులో టీఎస్ 02 యూబీ 2078 నెంబర్ గల ట్రాక్టర్ టీఎస్ 02 యూబీ 2079 నెంబర్ గల ట్రాలీ ద్వారా అనుమతి లేకుండా వేములవాడ మూలవాగు నుండి ఇసుకను తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్ డ్రైవర్ మొగిలి వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్ ఓనర్ పై కూడా కేసు నమోదు చేసి, ఇద్దరినీ జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించడం జరిగిందని,ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని బోయినిపల్లి ప్రొబేషనరీ ఎస్సై అనిల్ కుమార్ హెచ్చరించారు.

## వైద్య సేవల నాణ్యతపై జిల్లా ఆరోగ్య శాఖ దృష్టి

**- చందుర్తి, హనుమాజీపేటలో ఆరోగ్య కేంద్రాల తనిఖీలు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత ఆధ్వర్యంలో గురువారం చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,వేములవాడ రూరల్ మండలం,హనుమాజీపేట కాయకల్ప అసెస్మెంట్ కు సంబంధించిన తనిఖీలు నిర్వహించబడ్డాయి. ఈ తనిఖీల్లో జిల్లా క్వాలిటీ టీం భాగస్వామ్యం కావడం గమనార్హం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ తనిఖీల్లో ఆసుపత్రుల పరిసరాల పరిశుభ్రత, త్రాగునీరు, బాత్రూం, విద్యుత్ సదుపాయాలు, బిల్డింగ్ నాణ్యత ప్రమాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎన్‌హెచ్‌ఎం డీపీఓ రాజేందర్, క్వాలిటీ మేనేజర్ సింధుజ, వైద్యాధికారులు డాక్టర్ సురేష్, డాక్టర్ దివ్యశ్రీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రతీ స్థాయిలో నాణ్యతపై దృష్టి సారిస్తున్నామని అధికారులు తెలిపారు.

## ఆరోగ్య మిత్ర సేవలు మెరుగ్గా ఉండాలి

**అదనపు కలెక్టర్ డాక్టర్ ముకుంద రెడ్డి**

**రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి కార్యచరణ రూపొందించండి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆరోగ్య శ్రీ పథకంలో ఆరోగ్య మిత్రలది కీలక పాత్ర అని అదనపు కలెక్టర్ రెవిన్యూ డాక్టర్ జి ముకుంద రెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసుపత్రుల సూపర్డెంట్లు, ఆరోగ్య మిత్రులతో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి మెరుగైన సేవలు అందే దిశగా ఆరోగ్య మిత్రలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక వసతులు కల్పనతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లు, పబ్లిక్ హెల్త్ సెంటర్లు లలో సరిపడా ఆరోగ్య మిత్రులను భర్తీ కై పరిశీలన చేయడం జరుగుతుందని అన్నారు . సాధారణ కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కువగా జరుగుతున్నాయని అలాగే వివిధ వ్యాధులకు సంబంధించిన పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రస్తుత ఆరోగ్య సంరక్షణ సేవలను అంచనా వేయడం, కార్యాచరణ సవాళ్లను గుర్తించడం మెరుగైన సామర్థ్యం రోగి సంరక్షణ కోసం వాటాదారుల మధ్య సమన్వయాన్ని పెంచడం ఈ సమావేశం యొక్క ప్రాథమిక ఎజెండా. 62 కార్పొరేట్ ఆసుపత్రులు 32 ప్రభుత్వ ఆసుపత్రులు, వీటిలో 18 తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులలో, కేవలం 9 మాత్రమే ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్నాయని, మిగిలినవి నిష్క్రియంగా ఉన్నాయని గుర్తించబడిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద జాబితా చేయబడిన 1,835 విధానాలతో అన్ని వాటాదారులను పరిచయం చేయడానికి సామర్థ్య నిర్మాణం క్రమం తప్పకుండా శిక్షణా కార్యక్రమాల ప్రాముఖ్యతను అదనపు కలెక్టర్ నొక్కి చెప్పారు. సర్వీస్ డెలివరీ మెకానిజమ్‌ను బలోపేతం చేయడంలో భాగంగా, డేటా ఎంట్రీ ఆపరేటర్లు అందుబాటులో లేని సౌకర్యాలలో ముందస్తు అనుమతి అభ్యర్థనలను పెంచడానికి ఆరోగ్యమిత్రలను ఉపయోగించుకోవాలని ఆయన ఆదేశించారు. 2025 జనవరి నుండి ఏప్రిల్ వరకు ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రుల నెలవారీ పనితీరు డేటాను కూడా ముకుంద రెడ్డి సమీక్షించారు, ప్రభుత్వ ఆసుపత్రులు మొత్తం 65,150 మంది రోగులకు సేవలందించగా, ఈ కాలంలో ప్రైవేట్ ఆసుపత్రులు 23,985 కేసులను నిర్వహించాయని గుర్తించారు. ఈ పథకంలో వారి భాగస్వామ్యాన్ని మెరుగుపరచడానికి నిష్క్రియ టివివిపి ఆసుపత్రులపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆరోగ్య పథకం యొక్క అన్ని లబ్ధిదారులకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణకు సమాన ప్రాప్యతను నిర్ధారించడానికి పాల్గొనే వారందరి మధ్య సహకారాన్ని పెంచాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో మెరుగైన సమన్వయం మరియు సమర్థవంతమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి కార్యాచరణ వ్యూహాలను రూపొందించలన్నారు ఈ కార్యక్రమంలో డిస్టిక్ కోఆర్డినేటర్ హాస్పిటల్స్ డాక్టర్ రాజేంద్రనాథ్, డిస్టిక్ కో ఆర్డినేటర్ ఆరోగ్యశ్రీ డాక్టర్ సాయి నారాయణ గౌడ్, డిస్టిక్ మేనేజర్ ఆరోగ్యశ్రీ మహబూబ్ బాషా, వివిధ ఆసుపత్రుల సూపర్డెంట్లు, ఆరోగ్య మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతం పెంపునకు ప్రత్యేక కృషి చేయాలి

**- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జిల్లాలోని ప్రతి పాఠశాల తరగతి గదిలోని ప్రతి పిల్లవాడు చదవగలిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సాధించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులను ఆదేశించారు. నాంపల్లి అలియా ప్రభుత్వ మోడల్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఉపాధ్యాయులకు విద్యా బోధన సామర్థ్యాలను పెంపొందించే దిశగా ఏర్పాటుచేసిన 5 రోజుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో రీడింగ్, రైటింగ్ బేసిక్ లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పిల్లలు ఎక్కువ జ్ఞానం, నైపుణ్యాలను పెంచడానికి శిక్షణ యొక్క ప్రాముఖ్యతను అలాగే పాఠశాలలలో అభ్యాసాలు అమలు వ్యూహాలను ఈ సందర్భంగా చర్చించారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉన్నందున నాణ్యమైన విద్యా బోధన చేయాలని ఆయన సూచించారు. ఇలాంటి సదస్సులు ద్వారా విద్యా ప్రమాణాల అంశాలపై ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు చర్చించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. పాఠశాల తరగతిలోని ప్రతి విద్యార్థి చదవగలిగేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయులు పిల్లల పఠన స్థాయి పెంచాలని,ప్రతి పాఠశాలలో చదవడం రాని పిల్లలు మా పాఠశాలలో లేరు అని డిక్లేర్ చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో మౌలిక వస్తువులు సమకూర్చటంతో పిల్లల హాజరు శాతం గణనీయంగా పెరిగిందని అన్నారు. ఇంగ్లీష్ సబ్జెక్టులు పిల్లలు 90 మార్కులకు పైగా సాధించటంతో ఈ సందర్భంగా అభినందించారు. ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ అన్ని పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దివ్యాంగలైన విద్యార్థులకు వారి వైకల్యంబట్టి ప్రత్యేక శ్రద్ధతో బోధన చేయవలసిందిగా చేసి హైదరాబాద్ జిల్లాను ఉన్న స్థాయిలో నిలబెట్టాలని సూచించారు. ఈ సదస్సులో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. రోహిణి, డైట్ ప్రిన్సిపాల్ రవి కాంత్ రావు,ఎస్ఆర్పీలు నాగరాజు, బాలు ఉపాధ్యావులు తదితరులు పాల్గొన్నారు.

## గుట్ట అభివృద్ధిని మరిచి సుందరీమణుల పర్యటనకు ఖర్చులా

**- స్వామివారి నిధులు తరలించడం సిగ్గు చేటు**

**- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య**



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య క్షేత్ర అభివృద్ధిని మరిచి సుందరీమణుల పర్యటనకు దేవస్థాన ఖాజానా ఖర్చు చేయడమేంటనీ బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య ప్రశ్నించారు. స్వామివారి నిధులు తరలించడం సరైంది కాదన్నారు. స్వామివారి దర్శించుకునేందుకు వచ్చిన ప్రపంచ సుందరీమణులు పర్యటనకు దేవస్థాన ఖాజానా నుంచి రూ.35 లక్షల డబ్బులు డ్రా చేశారని అరోపించారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ 200 కోట్ల కేటాయించన తర్వాత కూడా స్వామివారి ఆదాయంలో నుంచి నిధులు కేటాయించడం పట్ల అనుమానాలకు తావిస్తున్నాయని తెలిపారు. వరంగల్ పర్యటలనలో భాగంగా తెలంగాణ ఆడపడచులతో సుందరీమణుల కాళ్ళు కడిగించడం, దుస్తులతో కాళ్లు తూడిపించడం వంటి చేష్టలు మహిళల ఆత్మగౌరవం దెబ్బతినేలా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సిగ్గులేని చర్యలుగా ఆయన అభివర్ణించారు. అధికారంలోకి వచ్చి 17 ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు స్వామివారి దేవస్థాన అభివృద్ధికి రూపాయి సైతం కేటాయించకపోగా స్వామివారి ఖాజానాను దోసుకుతీనే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఆదాయానికి గండికొట్టేందుకే ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్ర తొలిసీఎం కేసీఆర్ రూ. 1300 కోట్లతో ఎంతో అద్భుతంగా దేవస్థానాన్ని తీర్చిదిద్దారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల బీసీ విభాగం మండలాధ్యక్షుడు కనిడే మహేందర్, బీఆర్ఎస్ నాయకులు గుణగంటి బాబురావుగౌడ్, ఎగ్గిడి కృష్ణ, సిరబోయిన నర్సింగయాదవ్, బొట్ల నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## దోమల నియంత్రణ ద్వారానే డెంగ్యూ నివారణ సాధ్యం:కలెక్టర్ లక్ష్మీశ

**- మురుగు నీటి నిల్వలను అరికట్టి దోమలను నివారిద్దాం**



**విజయవాడ (ప్రశ్న న్యూస్)** దోమల నియంత్రణ ద్వారానే డెంగ్యూ వ్యాధిని ఆరికట్టగలుగుతామని అధికారులు, ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రాణాంతక డెంగ్యూ వ్యాధి ప్రబల కుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. ఈనెల 16 తేదీ జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ వ్యాధి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నగర పాలక సంస్థ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ అధికారులతో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుండి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి అనంతరం అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడుతూ దోమల నియంత్రణ ద్వారానే డెంగ్యూ వ్యాధిని ఆరికట్టగలుగుతామన్నారు. దోమల నివారణ పట్ల ప్రజలలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా సంబంధిత అధికారులు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు దోమల ద్వారా సంక్రమిస్తాయని, డెంగ్యూ వ్యాధి ఈడిస్ ఈజిప్ట్ దోమ కాటు ద్వారా సంక్రమిస్తుందని దోమలు వ్యాప్తిచెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోనేలా ప్రజలను చ్కెతన్యవంతులను చేయాలన్నారు. ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువైన దోమల ద్వారా మలెరీయా ఫైలేరియా డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు, వంటి వ్యాధులు వ్యాప్తిస్థాయన్నారు. నివాస పరిసరాల ప్రాంతాలలో సాధారణంగా ఆనాఫిలస్, క్యూలెక్స్, ఏడిస్, మాన్సోనియా, ఆర్మిజరిస్ దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. డెంగ్యూ వ్యాధిని వ్యాప్తిచేసే ఆడ దోమ ఉదయం, సాయంత్ర వేళల్లో చెమట పట్టే శరీర భాగాలపై కుట్టి రక్తాన్ని పీల్చుకొని నిల్వ ఉన్న నీటి పై గుడ్లను పెట్టి సంతానోత్పత్తి చేసుకొంటాయన్నారు. ప్రజలు ఉదయం సాయంత్రం వేళల్లో కిటికీలను మూసి ఉంచుకోవడం ద్వారా దోమలు ఇంట్లోకి రాకుండా చూసుకోవాలనన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.కార్యక్రమంలో జిల్లా మలేరియ అధికారి వి. మోతిబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. యం సుహాసిని, వైద్య ఆరోగ్య శాఖ, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత యోగ శిబిరం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రావిరాల గాయత్రి ఆశ్రమంలో మే 25 వరకు సుమారు 108 మంది పిల్లలకు సమ్మర్ క్యాంప్ ధ్యానం ప్రాణయమాలు ఆహార నియమాలు సూర్య నమస్కారాలు ఆసనాలపైన ఉచితంగా దక్షిణ జిల్లా సీనియర్ యోగ ప్రచారకుడు సంస్థ అల్లే సత్తయ్య శిక్షణ ఇస్తున్నారు. హైదరాబాదులో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఎవరైనా ఈ నెంబర్ పై సంప్రదించవచ్చని తెలిపారు. ఫోన్: 9490995238.

## ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెంట్రల్ అపెక్స్ బాడీ కి నామినేట్ అయినా డాక్టర్ గంగా సాగర్



**జగిత్యాల జిల్లా బ్యూరో(ప్రశ్న న్యూస్)** జగిత్యాల జిల్లా మెట్పల్లి కి చెందిన పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గంగా సాగర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెంట్రల్ అపెక్స్ బాడీ కి నామినేట్ అయినట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ సెక్రటరీ జనరల్ డాక్టర్ సర్బారీ దత్త ఒక ప్రకటన లో తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కు సంబంధించిన
కాన్ స్టిట్యూషనల్ అమెండ్మెంట్ అండ్ రేటిఫికేషన్ ఫర్ స్టేట్ అండ్ లోకల్ బ్రాంచెస్ చెందిన అపెక్స్ కమిటీ లో దేశ వ్యాప్తంగా ఆరుగురిని నామినేట్ చేయగా అందులో జగిత్యాల జిల్లా మెట్పల్లి కి చెందిన పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గంగా సాగర్ ను నామినేట్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా పలు వైద్యులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా ముత్యాలమ్మ అమ్మవారి కళ్యాణం

**- దుర్గమ్మ ఆలయం వద్ద గావురంగం, బలిగంప ఊరేగింపు**

**- పెద్ద ఎత్తున హాజరైన గ్రామస్తులు, భక్తులు ఆకట్టుకున్న భవిష్యవాణి**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని పూడూరు గ్రామంలో శ్రీ శివ్వంపేట పోచమ్మ-మైసమ్మ జాతర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా కన్నుల పండువగా గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ దుర్గమ్మ ఆలయం వద్ద గావురంగం నిర్వహించగా ఆలయ పూజారి కార్తీక్ భవిష్యవాణి వినిపించి బలిగంప ఊరేగింపును చేపట్టారు. ఈ ఉత్సవంలో భారీ ఎత్తున గ్రామస్తులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాళ్ల సంజీవ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎన్.నర్సింహ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పర్యాటకులకు మధురానుభూతిని కల్పించేలా కొండపల్లి బొమ్మల కేంద్ర అభివృద్ధి: కలెక్టర్ లక్ష్మీశ



కొండపల్లి (ప్రశ్న న్యూస్) మధురానుభూతిని కల్పించేలా కొండపల్లి ఖిల్లా, కొండపల్లి బొమ్మల తయారి కేంద్రాలను అభివృద్ధి చేయడంతో పాటు ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా. లక్ష్మీశ సంబంధిత అధికారులకు తెలిపారు. కొండపల్లి బొమ్మల తయారీ కాలనీ వద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు, కొండపల్లి ఖిల్లా అభివృద్ధి పై కలెక్టర్ డా. లక్ష్మీశ పర్యాటకుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మక కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రం, కొండపల్లి ఖిల్లాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేందుకు అపార అవకాశాలున్నాయన్నారు. కొండపల్లిలో సుమారు 400 సంవత్సరాలకు పైగా రాజస్థాన్‌కు చెందిన హస్త కళాకారులు అత్యంత కళాన్కెపుణ్యంతో తయారు చేసిన బొమ్మలకు జాతీయ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. కొండపల్లి పరిసర ప్రాంతాలలో లభ్యమయ్యే తెల్ల పొణికి చెక్కతో రూపొందించే కొండపల్లి బొమ్మలకు మరింత ప్రాచుర్యం కల్పించి కళాకారులను ప్రోత్సహించడం ద్వారా జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మల విశిష్టతను పర్యాటకులకు చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. భవనంలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి, సుందరీకరణ పనులు చేపట్టి ఆకర్షణీయంగా తీర్చిదిదేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొండపల్లి బొమ్మ చారిత్రక వైభవం, బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్ల పొణికి చెక్క గురించి అత్యంత ప్రాచుర్యం పొందిన బొమ్మల గురించిన విశేషాలను పర్యాటకులకు కళ్లకు కట్టినట్లుగా తెలియజేసి ప్రత్యక్ష అనుభూతి పొందేలా పర్యాటకులకు వివరించేందుకు ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఎంతో దోహదగపడుతుందన్నారు. కొండపల్లి బొమ్మల కాలనీ నుండి ఖిల్లా వరకు ఉన్న మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. కొండపల్లి వద్ద పర్యాటకులు ట్రెక్కింగ్ నిర్వహించుకునేలా తగ్గిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం ఆథారిటీ ఛీఫ్ మార్కెంటింగ్ ఆఫీసర్ ఎస్. పద్మారాణి, టూరిజం కన్సల్‌టెంట్ సాహితి, జిల్లా పర్యాటక అధికారి ఏ. శిల్ప, ఏపి టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ డిఇ శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రుద్రంగిలో మంత్రుల పర్యటనకు భారీ ఏర్పాట్లు

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమీక్ష**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, రుద్రంగిలో రెవెన్యూ,హౌసింగ్, ఐ అండ్ పి.ఆర్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేడు (మే 16) రుద్రంగి మండలాన్ని సందర్శించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. ఈ పర్యటనకు సంబంధించి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లివిప్ ఆది మాట్లాడుతూలి, భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. ధరణి వ్యవస్థ వల్ల పేదలకు ఎదురైన సమస్యల పరిష్కారానికి కొత్త చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ భూములపై పట్టాలు మంజూరు చేస్తామన్నారు. పర్యటనలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పాల్గొంటారని తెలిపారు.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం కూడా జరగనుందని వివరించారు. లికలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూలి రెవెన్యూ సదస్సులు, ఇండ్ల నిర్మాణ శంకుస్థాపన వంటి అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో



పనిచేయాలన్నారు. హెలిపాడ్, సభా వేదిక, పారిశుధ్య ఏర్పాట్లు, టెంట్లు, కుర్చీలు, విద్యుత్ సరఫరా, అంబులెన్స్ వంటి అంశాల్లో నిర్దిష్ట కార్యాచరణ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష అనంతరం కలెక్టర్, ఇతర అధికారులు పర్యటన ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయ్, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో నటరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నియోజకవర్గపర్యటనలో వెలుగులోకి పలు సమస్యలు

- సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో రోజుకి "3 నుంచి 5"కార్యక్రమాలకు హాజరు
- ప్రజలే నా దేవుళ్ళు అంటూ పర్యటన,వెలుగు చూస్తున్న పలు సమస్యలు
- తన పరిధిలో ఉన్నవి అక్కెకడిక్కడే పరిష్కారం, మిగితావి అధికారులతో భేటీ
- మోడల్ కంటోన్మెంట్ గా తీర్చిదిద్దాలని అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే
- జంటనగరాల్లో ఎకైక ఎమ్మెల్యే, నిధులు మంజూరులో ప్రభుత్వం ఫూల్ సపోర్ట్





**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో గల్లీ నుంచి కాలనీ వరకు ఏ సమస్య అయిన ఓపికగా వింటూ సమాధానం ఇస్తూ పరిష్కరిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్.బోర్డు పరిధిలో నెలకొన్న మౌళిక సదుపాయాల కల్పనలో ఫోకస్ చేస్తూ దశల వారీగా నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో పయనించే విధంగా చర్యలు తీసుకుంటామని గతంలో పలు మార్లు పేర్కొన్నారు. అలాగే సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఒక డివిజన్,ఎనిమిది వార్డులు(ఉన్న విషయం విదితమే! కానీ మోండ డివిజన్ పరిధిలో ప్రతి సమస్యకి యుద్ధప్రాతిపదికన అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.కానీ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో మాత్రం సమస్య భిన్నంగా ఉంటుంది.ఎందుకంటే బోర్డు ఓం"అటానమస్ బాడీ" అధ్యక్షుడుగా ఆర్మీ బ్రిగేడియర్ స్థాయి అధికారితో పాటు ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీసర్ అయిన అధికారి పరిపాలన,అంతర్గత వ్యవహారాలు చూస్తుంటారు. అలాగే బోర్డు పరిధిలో ఎమ్మెల్యే అభిప్రాయాలు, సలహాలు సూచనలు పరిగణనలోకి తీసుకుంటారే తప్ప చివరగా కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడుదే నిర్ణయం ఫైనల్.అందుకే స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ కి సమస్యలు తెలుసుకోవడం అవి ఎవరి పరిధిలోకి వస్తాయి అని తెలుసుకొని వీలైనంత త్వరగా వార్డుల్లో మౌళిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిన్న గురువారం నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న బస్తీల పర్యటనలో భాగంగా కంటోన్మెంట్ మూడో వార్డ్, మడ్ ఫోర్ట్,చర్చ్ లైన్ రోడ్, శ్రీరామ్ నగర్,అంబేద్కర్ నగర్ గాంధీ నగర్లలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పర్యటించారు.అలాగే బస్తీలలో కలిసి తిరుగుతూ స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యల గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే.ముఖ్యంగా రెండు పడకల ఇండ్లలో పై అంతస్తులో ఉన్న వాళ్లకి మంచి నీళ్లు అందడం లేదని, కరెంట్ బిల్లులు మోయలేని భారంగా ఉన్నాయని వాటిని మాఫీ చేయాలని రెండు పడకల ఇండ్లలో నివసిస్తున్న పేదలు వారి ఆవేదనను వ్యక్తం చేశారు.అలాగే వందల సంఖ్యలో కుటుంబాలు నివసిస్తున్న నేపథ్యంలో చిన్న చిన్న శుభ కారి క్రమాలు చేసుకుందాం అంటే చిన్న పాటి కమ్యూనిటీ హాలు లేకపోవడం అందరికీ ఇబ్బంది గా మారిందన్నారు.స్థానిక సమస్యలన్నిటిని ఓపికగా వింటూన్న ఎమ్మెల్యే శ్రీగణేష్ వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి తగిన చర్యలు చేపడుతానని స్థానికులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే తమ బస్తీకి వచ్చి తమ సమస్యలు తెలుసుకోవడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ బస్తీ పర్యటనలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### ఏడులో పర్యటన:

నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్.నియోజకవర్గ పరిధిలోని ఏడో వార్డులో గన్ రాక్ ఏరియాలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాడానికి నియోజకవర్గ స్పెషల్ డెవలప్మెంట్ నిధులు తొమ్మిది లక్షల రూపాయలు కేటాయించారు.ఆయన నిన్న పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని,ప్రజల ఆరోగ్యం కోసం కాలనీలు, బస్తీలలో ఓపెన్ జిమ్లు ఏర్పాటు చేయాలనే సంకల్పంతో నియోజకవర్గానికి ప్రత్యేక నిధులను తీసుకు వస్తున్నానని,అందులో నుంచి తొమ్మిది లక్షల రూపాయలతో గన్ రాక్ ఏరియాలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయబోతున్నామని, పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు నిధులు కేటాయించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్ ను స్థానికులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మురళి ముదిరాజ్,నాగినేని సరిత, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని,నవీన్,గోకుల్,రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సాయి వర్ధన్ విజయం తెలంగాణ యువతకు స్ఫూర్తిదాయకం:

బీహార్ లోని ఔరంగాబాద్ "ఖేలో ఇండియా" శిబిరంలో భారతదేశ వ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులతో వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించారు.ఈ పోటీలలో ప్రఖ్యాత కోచ్ విజయ్ రొయిలా నేతృత్వంలో శిక్షణ పొందిన కంటోన్మెంట్ నియోజకవర్గం కారా?నా ప్రాంతానికి చెందిన,17 ఏళ్ళ జవాజి సాయి వర్ధన్ 89 కేజీల విభాగంలో 275 కేజీల బరువు ఎత్తి స్వర్ణ పతకాన్ని సాధించి అద్భుతమైన ప్రతిభను చాటారని.సాయి వర్ధన్ వ్యక్తిగత కోచ్,ఇంటర్ నేషనల్ వెయిట్ లిఫ్టర్ అయిన తన తండ్రి జవాజి శివ కుమార్ తో కలిసి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి అద్భుత క్రీడప్రదర్శన ఇచ్చిన సాయి వర్ధన్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి కావడం గర్వంగా ఉందని,అలాగే భవిష్యత్తులో దేశం తరఫున ప్రపంచ వేదికలపై తన సత్తా చాటి మరిన్ని పతకాలను సాధించాలని,సాయి వర్ధన్ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని,మరింత కష్టపడి నియోజకవర్గానికి,రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు సంకి రవీందర్, తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ కాలేరు శ్రీనివాస్,ఇంటర్ నేషనల్ వెయిట్ లిఫ్టర్ రాజ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

### నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ లేదు : ఎమ్మెల్యే:

నియోజకవర్గ పరిధిలోని వార్డు ఎనిమిది కలాసిగూడలో కంటోన్మెంట్ హాస్పిటల్ నుండి ప్రభుత్వ టాయిలెట్ కాంప్లెక్స్ వరకు సీసీ రోడ్డు వేయడానికి ఎమ్మెల్యే నియోజకవర్గ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నుండి ముప్పై రెండు లక్షల రూపాయలను కేటాయించి, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్ తో కలిసి పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ

కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో ముందుంటానని,గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తానని చెప్పారని, రాజకీయాలకతీతంగా అందరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని, కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు.ఈ పనుల ప్రారంభోత్సవంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి,బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు రామ్, యువజన కాంగ్రెస్ నాయకులు అరవింద్, నాయకులు ప్రేమ్ కిరణ్, ముఖేష్,హయత్ ఖాన్, శ్రీనివాస్,అల్లం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ ధరకు అమ్ముడుపోయిన నాని "ది ప్యారడైజ్" ఆడియో రైట్స్




హిట్ 3తో సూపర్ హిట్ అందుకున్న నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది ప్యారడైజ్ దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటంతో పాటలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ఆడియో హక్కులు భారీ ధరకు అమ్ముడుపోయినట్లు తెలుస్తుంది. ప్రముఖ మ్యూజిక్ కంపెనీ సరిగమ మ్యూజిక్ రూ. 18 కోట్లకు "ది ప్యారడైజ్" ఆడియో రైట్స్‌ని దక్కించుకున్నట్లు సమాచారం. నాని కెరీర్‌లో ఒక సినిమా ఆడియో హక్కులకు ఇంత పెద్ద మొత్తం రావడం ఇదే మొదటిసారి అని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా విడుదల కాకముందే ఆడియో హక్కులు ఇంత పెద్ద మొత్తానికి అమ్ముడుపోవడం చిత్ర యూనిట్‌కు ఉత్సాహాన్నిచ్చింది. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఈ చిత్రం తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ మరియు స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది (2026) మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం 1980ల కాలంలో హైదరాబాద్‌లో జరిగిన కొన్ని నిజమైన సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు సమాచారం. ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతోంది.

# 'మరణ మాస్' (సోనీ లివ్) మూవీ రివ్యూ!



మలయాళంలో బాసిల్ జోసెఫ్ కి మంచి క్రేజ్ ఉంది. ఈ మధ్య కాలంలో ఆయన అక్కడ కామెడీకి కేరాఫ్ అడ్రెస్ గా మారిపోయాడు. అలాంటి ఆయన ప్రధాన పాత్రధారిగా రూపొందిన సినిమానే 'మరణ మాస్'. శివప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఏప్రిల్ 10వ తేదీన థియేటర్లకు వచ్చింది. బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లను రాబట్టిన సినిమా ఇది. అలాంటి ఈ సినిమా, ఈ రోజు నుంచే ' సోనీ లివ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ బ్లాక్ కామెడీ ఎంతవరకూ నవ్వించిందనేది చూద్దాం. కథ: కేరళలోని ఓ గ్రామంలో వరుస హత్యలు జరుగుతూ ఉంటాయి. చీకటిపడితే చాలు, బయటికి రావడానికి జనాలు భయపడుతూ ఉంటారు. కిల్లర్ హత్య చేసిన అనంతరం శవాల నోట్లో 'అరటిపండు' పెడుతూ ఉంటాడు. దాంతో అందరూ అతనిని 'బనానా కిల్లర్' అని పిలుచుకుంటూ ఉంటారు. అదే గ్రామానికి చెందిన ల్యూక్ (బాసిల్) జెస్సీ (అనీష్మా)ని లవ్ చేస్తూ ఉంటాడు. ల్యూక్ లుక్ .. స్టైల్ కాస్త డిఫరెంట్ గా ఉండటంతో, అతనే కిల్లర్ అనే ఒక ప్రచారం జరుగుతూ ఉంటుంది. 'బనానా కిల్లర్' కేసును ఛేదించడానికి పోలీస్ ఆఫీసర్ అజయ్ రామచంద్రన్ (ఆంటోని) రంగంలోకి దిగుతాడు. ఇక జిక్కు డ్రైవర్ గా పనిచేసే ట్రావెల్స్ బస్ కి అరవింద్ కండక్టర్ గా పనిచేస్తూ ఉంటాడు. 20 ఏళ్ల క్రితం కనిపించకుండా పోయిన తన తండ్రి ఎప్పుడు తిరిగి వస్తాడా అనే అరవింద్ ఎదురుచూస్తూ ఉంటాడు. ఇక జిక్కూ మాత్రం త్వరలో తన పెళ్లి జరగనున్నందుకు హ్యాపీగా ఉంటాడు. సాధ్యమైనంత త్వరగా డ్యూటీ దిగాలని కంగారులో ఉంటాడు. ఈ నేపథ్యంలోనే 'కేశవ' అనే ఒక వృద్ధుడిని వెంటబెట్టుకుని ఆ సీరియల్ కిల్లర్ ఈ బస్సు ఎక్కుతాడు. అతను ఆ వృద్ధుడిని చంపాలనే ఆలోచనలో ఉంటాడు. అదే సమయంలో జెస్సీ ఆ బస్సు ఎక్కుతుంది. జీవితం పట్ల సీరియస్ నెస్ లేదనీ, అందువల్లనే ల్యూక్ ను కిల్లర్ గా అనుమానిస్తున్నారని జెస్సీ భావిస్తుంది. అతనికి బ్రేకప్ చెబుతుంది. దాంతో ఆమెను బ్రతిమాలటం కోసం ల్యూక్ కూడా ఆ బస్సు ఎక్కుతాడు. ఒక వైపున సైకో కిల్లర్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని పోలీస్ లు హెచ్చరిస్తూ ఉంటే, ప్రధానమైన పాత్రలన్నీ సైకో ఉన్న బస్సులోకి వచ్చి చేరతాయి. ఆ బస్సులో ఏం జరుగుతుంది? ఆ సైకో ఎవరు? కేశవతో ఆ సైకోకి ఉన్న సంబంధం ఏమిటి? లవర్ కోసం బస్సు ఎక్కిన ల్యూక్ కి ఎలాంటి పరిస్థితి ఎదురవుతుంది? తనపై పడిన కిల్లర్ ముద్రను అతను చెరిపేసుకుంటాడా? అనేది కథ. విశ్లేషణ: మలయాళ దర్శకులు అతి తక్కువ పాత్రలతో .. తక్కువ బడ్జెట్ లో ఇంట్రెస్టింగ్ కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తుంటారు. అలాంటి సినిమాలలో కొన్ని వసూళ్ల పరంగా కొత్త రికార్డులను క్రియేట్ చేశాయి. అలాంటి సినిమాల జాబితాలో 'మరణ మాస్' చేరిపోయిందనే చెప్పాలి. బాసిల్ జోసెఫ్ మార్క్ సినిమాకి, టోవినో థామస్ నిర్మాతగా వ్యవహరించడం విశేషం. ఈ కథ ఒక 20 శాతం వరకు మాత్రమే బయట జరుగుతుంది. మిగతా కథ అంతా రన్నింగ్ బస్సులోనే నడుస్తుంది. బస్సులోని అరడజను పాత్రల చుట్టూనే ఈ కథ తిరుగుతుంది. ఫస్టు పార్టు వరకూ ఈ సినిమా కాస్త సరదాగానే నడుస్తుంది. సెకండాఫ్ లో మాత్రం కథ కాస్త నిదానిస్తుంది. పిండుకోవాల్సినంత కామెడీని పిండుకోలేదేమోనని అనిపిస్తుంది. బాసిల్ స్థాయి కామెడీ వర్కౌట్ కాలేదని అనిపిస్తుంది. బాసిల్ పాత్రను ఇంకాస్త వినోదభరితంగా డిజైన్ చేయవలసింది. అలాగే బస్సు డ్రైవర్ .. కండక్టర్ పాత్రల వైపు నుంచి కథను టైట్ చేయవలసింది. ఇక పోలీస్ ఆఫీసర్ అజయ్ రామచంద్రన్ పాత్రను కూడా పెద్దగా ఉపయోగించుకోలేదు. ఆయన కుక్క వైపు నుంచి కూడా కామెడీ ట్రాక్ ను సరిగ్గా డిజైన్ చేయలేదు. ఈ కాన్సెప్ట్ ను ఇంకాస్త బాగా తీయవచ్చనే ఒక భావన మాత్రం కలుగుతుంది. పనితీరు: బాసిల్ జోసెఫ్ ఎంట్రీ .. హీరో విజయ్ స్టైల్లో గాల్లోకి చేతులు ఊపడం .. సరదాగా అనిపిస్తాయి. కానీ ఆ తరువాత ఆ లుక్ పరంగా తప్ప, మేనరిజం పరంగా ఏమీ చేయలేకపోయింది. సైకో కిల్లర్ రాజేశ్ మాధవన్ నటన కూడా బాగానే ఉంది. మిగతా వాళ్లంతా తమ పాత్రలు మాత్రమే తెరపై కనిపించేలా చేయగలిగారు. కథ అంతా బస్సులోనే నడుస్తుంది గనుక, నిర్మాణ విలువల గురించి మాట్లాడుకోవాల్సిన పనిలేదు. నీరజ్ రవి ఫొటోగ్రఫీ విషయంలోను ఇదే మాటను చెప్పుకోవాల్సి ఉంటుంది. జేకే నేపథ్య సంగీతం ఫరవాలేదు. చమన్ చాకో ఎడిటింగ్ ఓకే. ముగింపు: దర్శకుడు ఎంచుకున్న లైన్ బాగుంది. తక్కువ పాత్రల మధ్యలో .. ఇంట్రెస్టింగ్ డ్రామాను నడిపించాలనే ఆలోచన బాగుంది. కానీ ఆశించినస్థాయిలో పాత్రలను డిజైన్ చేయలేదని అనిపిస్తుంది. ఇంకాస్త వైవిధ్యంగా స్క్రిప్ట్ పై కసరత్తు చేసి ఉంటే, బాసిల్ మార్క్ కామెడీ వర్కౌట్ అయ్యేదేమో.

# కర్ణాటక హైకోర్టులో సింగర్ సోనూ నిగమ్‌కు భారీ ఊరట



బాలీవుడ్ సింగర్ సోనూ నిగమ్‌కు కర్ణాటక హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఇటీవల బెంగళూరులో జరిగిన ఒక మ్యూజికల్ ఈవెంట్‌లో కన్నడ ప్రజలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసుకు సంబంధించి నేడు హైకోర్టులో విచారణకు జరుగగా%ా% ఈ కేసులో సోనూ నిగమ్‌కి హైకోర్టు తాత్కాలిక ఊరట కల్పించింది. ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణ వరకు సోను నిగమ్‌ను అరెస్టు చేయవద్దని అలాగే అతడిపై ఇతర బలవంతపు చర్యలు చేపట్టవద్దని జస్టిస్ శివశంకర్ అమరన్నవర్ నేతృత్వంలోని వెకేషన్ బెంచ్ స్పష్టం చేసింది. అయితే, ప్రస్తుతం అతడిపై ఉన్న కేసుకి సంబంధించి పోలీసు దర్యాప్తునకు ఆయన సహకరించాలని షరతు విధించింది.అలాగే వాంగ్మూలం నమోదు చేయడానికి సోను నిగమ్ వ్యక్తిగతంగా కర్ణాటకకు రావాల్సిన అవసరం లేదని కోర్టు పేర్కొంది. పోలీసులు ఆయన వాంగ్మూలం తీసుకోవాలనుకుంటే, వారి ఖర్చులతో ఆయన నివాసానికి వెళ్లి తీసుకోవచ్చని తెలిపింది. అంతేకాకుండా, తదుపరి విచారణ వరకు తుది పోలీసు నివేదిక దాఖలు చేయడాన్ని కూడా హైకోర్టు నిలిపివేసింది.కాగా, ఏప్రిల్ 25న బెంగళూరులో జరిగిన ఒక మ్యూజికల్ ఈవెంట్‌లో కన్నడ పాటలు పాడమని కొందరు ప్రేక్షకులు కోరగా, సోను నిగమ్ అసహనం వ్యక్తం చేస్తూ దానిని పహల్గామ్ ఉగ్రదాడితో పోల్చారని ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడంతో కర్ణాటక రక్షణ వేదిక ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సోను నిగమ్‌పై నేరపూరిత బెదిరింపు, శాంతి భంగం కలిగించడానికి ఉద్దేశపూర్వకంగా అవమానించడం వంటి పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.అయితే, తన వ్యాఖ్యలు కొందరు అమర్యాదగా ప్రవర్తించిన వ్యక్తులను ఉద్దేశించి మాత్రమేనని, కన్నడ సమాజం మొత్తాన్ని కాదని సోను నిగమ్ వివరణ ఇచ్చారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆయనకు తాత్కాలిక ఊరట కల్పించింది. ఈ కేసు తదుపరి విచారణకు వాయిదా పడింది.

# పాన్ ఇండియా సినిమాతో రాబోతున్న గాలి జనార్ధన్ తనయుడు..జూలైలో విడుదల

గాలి జనార్ధన్ రెడ్డి పేరు చాలా మంది వినే ఉంటారు. . కర్ణాటకలో అత్యంత ధనవంతులైన రాజకీయ నాయకులలో ఆయన ఒకరు కాగా,ఆయన ఆయన కూతురు పెళ్లితో దేశమంతా మాట్లాడుకునేలా చేశారు. వందల కోట్లు పెళ్లి కోసం ఖర్చుపెట్టి హాట్ టాపిక్ అయ్యారు. ఇక కొడుకుని ఇండస్ట్రీకి పరిచయం చేయాలని భావించి 2022లో 'జూనియర్ అనే సినిమా మొదలు పెట్టారు. కిరిటీ హీరోగా రాధాకృష్ణ దర్శకత్వంలో ఈ సినిమాను సాయి కొర్రపాటి ప్రొడక్షన్ హౌస్ లో రజని నిర్మిస్తున్నారు. శ్రీలీల ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జెనీలియా , రవిచంద్ర కీలక పాత్రలు పోషించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని సమకూర్చారు.ఇక ఈ సినిమాలో భారీ క్యాస్టింగ్ తో పాటు ప్రముఖ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. ఎప్పుడో మొదలైన జూనియర్ అనే చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఐదు భాషల్లో జూలై 18న విడుదల చేయబోతున్నట్టు గురువారం మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి కె. కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రాఫర్ కాగా, పీటర్ హెయిన్ యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. తండ్రి జనార్ధన్ రెడ్డి ఓ పక్క జైలు జీవితాన్ని గడుపుతుంటే– కొడుకు కిరీటి సినిమా జాతీయ స్థాయిలో విడుదల అవుతుండడం చర్చనీయాంశంగా మారింది. భారీ బడ్జెటతో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్టు తెలుస్తుండగా, కిరీటీ తొలి సినిమాతో మంచి హిట్ అందుకుంటాడా లేదా అనేది చూడాలి. ఇక గాలి జనార్ధన్ రెడ్డి విషయానికి వస్తే ఓబుళాపురం మైనింగ్ కేసులో గాలి జనార్ధన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సీబీఐ కోర్టు తీర్పు చెప్పింది. ఆయన కేవలం ఓ ఓ సాధారణ పోలీస్ కానిస్టేబుల్ కొడుకు. ఆయన తండ్రి చిత్తూరు జిల్లా నుంచి బళ్లారికి వలస వెళ్లారు. బుళాపురం మైనింగ్ కంపెనీ పేరుతో మైనింగ్ వ్యాపారం ప్రారంభించకముందు, కోల్‌కతాలోని ఓ కంపెనీ కోసం గాలి జనార్ధన్ రెడ్డి ఇన్సూరెన్స్ పాలసీలు విక్రయించే వారు. ఆ తర్వాత చిట్‌ఫండ్ సంస్థను ప్రారంభించారు. అందులో ఆయన అక్రమాలకు పాల్పడటంతో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) చర్యలతో దీన్ని మూసేశారు. అయితే అక్కడే ఆయనకు చాలా కిటుకులు తెలుసకొని వ్యాపారాల్లో, రాజకీయాల్లో జనార్ధన్ రెడ్డి సరికొత్త మార్గాలను అన్వేషించారు. రాజకీయాలలో కూడా ఆయన తన మార్క్ చూపించారు.






# పెళ్లి కాకుంటే ఆ హీరోతో డేటింగ్..అనసూయ ఇంత ఓపెన్‌గా చెప్పేసింది ఏంటి?

అందాల ముద్దుగుమ్మ అనసూయ న్యూస్ రీడర్‌గా కెరియర్ మొదలు పెట్టి, ఆ తర్వాత యాంకర్ గా మారింది. జబర్దస్త్‌తో ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న తర్వాత సినిమాలలోకి అడుగుపెట్టింది. 2003లో మొదటి సారి తెరపై కనిపించిన అనసూయ దాదాపు 13 సంవత్సరాల తర్వాత 'సోగ్గాడే చిన్ని నాయనా' చిత్రంలో నాగార్జునతో కలిసి నటించి తెలుగు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అందులో అనసూయ నటనకి మంచి మార్కులే పడ్డాయి. ఇక అదే సంవత్సరం అనసూయ చేసిన 'క్షణం' చిత్రం కూడా మంచి ఆదరణ పొందింది. ఇక నటిగా అనసూయ స్థాయిని పెంచిన చిత్రం రంగస్థలం కాగా, ఇందులో రంగమ్మత్త పాత్ర ఆమె కెరీర్‌లో మైల్ స్టోన్‌గా నిలిచింది. ప్రస్తుతం టీవీ షోలతోపాటు కొన్ని సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తున్నారు అనసూయ భరద్వాజ్.అయితే అనసూయ తాజాగా ఓ బుల్లితెర కార్యక్రమంలో తన కెరీర్ గురించి మాట్లాడుతూ టాలీవుడ్ హీరోలపై సరదాగా కామెంట్స్ చేసింది. యాంకర్ రవి, శ్రీముఖి హోస్ట్ చేసిన టీవీ షోలో టాస్క్ ప్రకారం అడిగిన ప్రశ్నలన్నింటికి నిజాయితీగా సమాధానం చెప్పాలి. లేదంటే పచ్చి మిరపకాయ తినాల్సి వస్తుంది అని యాంకర్ రవి, శ్రీముఖి తెలిపారు. దీంతో అనసూయ ఛాలెంజ్ ని యాక్సెప్ట్ చేసింది. ఇక రవి ప్రశ్నిస్తూ మీకు ఒకవేళ పెళ్లి కాకుంటే టాలీవుడ్ లో ఏ హీరోతో డేటింగ్ చేసేవారు అని అడగ్గా, దానికి ఏ మాత్రం ఆలోచించకుండా రామ్ చరణ్ అని సమాధానం చెప్పింది. అలానే అడవి శేష్ గురించి కూడా కామెంట్స్ చేస్తూ.. శేష్ షూటింగ్ లొకేషన్ లో మిలిటరీ ఆఫీసర్ లాగా స్ట్రిక్ట్ గా ఉంటారు. అడవి శేషు అలా ఉండడం వల్లే క్షణం కానీ, అతని ఇతర చిత్రాలు కానీ విజయం సాధిస్తున్నాయంటూ ప్రశంసలు కురిపించింది. ఇక ఇదే షోలో తన భర్త శశాంక్ భరద్వాజ్ గురించి మాట్లాడుతూ.. ఆయనలో ఉన్న ఒకే ఒక్క నెగిటివ్ క్వాలిటీ షార్ట్ టెంపర్ అని పేర్కొంది. మిగిలిన అన్ని విషయాల్లో తన భర్త మిస్టర్ పర్ఫెక్ట్ అంటూ ప్రశంసలు కురిపించింది. తన పేరు గురించి కూడా ప్రస్తావిస్తూ.. మొదట తన తల్లి తనకి పవిత్ర అనే పేరు పెట్టాలనుకుంది. అందుకే పవిత్ర అనే పేరు కూడా తనకిష్టమని అనసూయ తెలిపింది.

# '7G బృందావన్ కాలనీ' సీక్వెల్‌లో హీరోయిన్‌గా మలయాళం నటి



తెలుగు సినిమా చరిత్రలో ఎన్నో ప్రేమ కథాంశాలతో సినిమాలు వచ్చాయి. కానీ, వాటిలో కొన్ని మాత్రమే ప్రేక్షకుల హృదయాలను కలచివేశాయి. అలాంటి చిత్రాలలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది 7G బృందావన్ కాలనీ. ఒక అందమైన ప్రేమకథా చిత్రంగా పేరు తెచ్చుకున్న ఈ సినిమాకు యుగానికి ఒక్కడు సినిమాతో గుర్తింపు పొందిన సెల్వ రాఘవన్ దర్శకత్వం వహించారు. ఇందులో రవి కృష్ణ మరియు సోనియా అగర్వాల్ హీరో హీరోయిన్లుగా నటించారు. 2004లో విడుదలైన ఈ సినిమా తమిళంలో కంటే తెలుగులోనే పెద్ద విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమాకు సీక్వెల్ రాబోతోందని దర్శకుడు ప్రకటించిన విషయం తెలిసిందే. 7G బృందావన కాలనీ 2 పేరుతో ఈ సినిమా రూపొందుతోంది. ఈ సీక్వెల్‌కు కూడా సెల్వ రాఘవన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే మోషన్ పోస్టర్‌ను విడుదల చేయగా ఆకట్టుకుంది. అయితే తాజాగా ఈ సినిమాలో కథానాయిక రోల్‌కి సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. మొదట్లో ఈ సినిమాలో హీరోయిన్‌గా లవ్ టుడే ఫేమ్ ఇవానా, శంకర్ కూతురు అదితి శంకర్ నటిస్తున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీలో మరో కథానాయిక పేరు వినిపిస్తుంది. మలయాళ సినిమా రేఖచిత్రంతో సూపర్ హిట్ అందుకున్న నటి అనస్వరరాజన్ 7G బృందావన కాలనీ 2లో హీరోయిన్‌గా నటించబోతున్నట్లు సమాచారం. కాగా ఈ విషయంపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వవలసి ఉంది. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

## విజయవాడ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న :విశాఖ నగర మేయర్



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులు విశాఖ నగర ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. ఏపీ యు ఎఫ్ ఐ డి సి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తో కలిసి విజయవాడ లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ శ్రీ దుర్గమ్మ తల్లి ఆశీస్సులు విశాఖ నగర ప్రజల పై ఉండాలని విశాఖ నగర ప్రజల శ్రేయస్సు, శాంతి అభివృద్ధి కొరకు నగరాభివృద్ధి వేగవంతంగా జరిగేలా దుర్గమ్మ ను వేడుకున్నట్లు తెలిపారు. శ్రీ దుర్గమ్మ వారి దర్శనానంతరం వేదపండితుల నుండి ఆశీర్వచనం పొంది ఆలయ అధికారుల నుండి తీర్థ ప్రసాదాలను మేయరు స్వీకరించారు.

## మైనారిటీ కార్పొరేషన్ క్రింద 72 లోన్లు దరఖాస్తు చేసుకోండి : కమిషనర్ మౌర్య



తిరుపతి( ప్రశ్న న్యూస్) మున్సిపల్ కార్పొరేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరమునకు గాను మైనారిటీ కార్పొరేషన్ క్రింద 72 లోన్లను కేటాయించారని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఇందులో కెనరా బ్యాంకు- 13, ఇండియన్ బ్యాంకు %-% 4, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు-3, పంజాబ్ నేషనల్ బ్యాంకు-3, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా-34, యుకో బ్యాంకు -1, యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా -14 మొత్తము 72 టార్గెట్ కేటాయించారని తెలిపారు. 25.05.2025 లోపు ఆన్ లైన్ నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్ లైన్ నందు దరఖాస్తు చేసిన అభ్యర్థులు 3 సెట్లు అప్లికేషన్లు , డాక్యుమెంట్లను సంబంధిత సచివాలయం నందు చేర్చవలెను. కావున ఆసక్తి గల, అర్హత గల ముస్లింలు, సిక్కులు, బౌధులు, జైన్లు, పార్శిలు క్రైస్తవ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.

## ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ నిర్వహణ బాగుంది

**- 16వ ఆర్థిక కమిషన్ మెంబర్ సౌమ్య కంటి ఘోష్**



**తిరుపతి(ప్రశ్న న్యూస్)** తూకివాకంలో తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ నిర్వహణ బాగుందని 16వ ఆర్థిక కమిషన్ సభ్యులు సౌమ్య కాంతి ఘోష్ అన్నారు. తూకివాకంలో తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ చెత్త నుండి సంపద కేంద్రం ను జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య తో కలిసి 16వ ఆర్థిక కమిషన్ సభ్యులు సౌమ్యకాంతి ఘోష్, సెక్రటరీ గౌతమ్ అల్లాడ లు పరిశీలించారు. ఈ ప్లాంట్ నందు ఘన వ్యర్థాల నిర్వహణ, తడి చెత్త నిర్వహణ కంపోస్టు, బయో మెథనైజేశన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల నిర్వహణ గురించి తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య పలు అంశాలు వివరించారు. ఈ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా నగరంలో ఏర్పడిన అన్ని రకాల చెత్తను, మురుగునీటిని నిర్వహణ చేసి సంపద సృష్టించే విధానం గురించి వివరించారు. తిరుపతి నగరంలో సేకరించిన తడి, పొడి చెత్త ద్వారా ఏర్పడిన పొడి చెత్త నిర్వహణ చేస్తారని, ఇందులో వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారని, తడి చెత్త ను నిర్వహణ చేసి కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తారని, ఇక మార్కెట్ నుండి వెలువడే వ్యర్థాలు, హోటల్స్ నుండి సేకరించిన వ్యర్థాలను నిర్వహణ చేసి వంట గ్యాస్ ను ఉత్పత్తి చేసి విక్రయించడం జరుగుతుందని తెలిపారు. నగరంలో ప్రతిరోజూ ఉత్పతి అయ్యే సుమారు 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను నిర్వహణ చేసి ఆరు రకాలుగా గుల్ల, ఇసుకగా మారుస్తారని, ఇలా ఉత్పత్తి అయిన ఇసుక గుల్ల తో పేవర్స్ తయారు చేస్తారని తెలిపారు. ప్రతిరోజూ తడి చెత్త 150 టన్నులు, 75 టన్నులు పొడి చెత్త నిర్వహణ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ట్రీటెడ్ వేస్ట్ నీటిని పరిశ్రమలకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నేత వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి నారా లోకేష్, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**ఒంగోలు(ప్రశ్న న్యూస్)** ఇటీవల దారుణ హత్యకు గురైన టిడిపి నేత మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు పరామర్శించారు. లోకేష్ బాబు తో దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కూడా హాజరై వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మన బ్రోలు లోని వీరయ్య చౌదరి నివాసానికి లోకేష్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి జిల్లాలోని మంత్రులు శాసనసభ్యులు పార్టీ ఇన్చార్జులు గురువారం వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ వీరయ్య చౌదరి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని వారికి అండగా నిలుస్తామని దోషులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తో పాటు జిల్లా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, విధ్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు దామరచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డి , బి ఎన్ విజయ్ కుమార్ , ఇంటూరి నాగేశ్వరరావు , జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలు హాజరై వీరయ్య చౌదరి కి నివాళులర్పించారు.

## సరస్వతి పుష్కరాల్లో సీఎంతో కలిసి పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** భూపాలపల్లి జిల్లాలోని ప్రసిద్ధ కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలో జరుగుతున్న పవిత్ర సరస్వతి పుష్కర మహోత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రివేణి సంగమం వద్ద జరిగిన ప్రత్యేక పుష్కర స్నాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్,కొండా సురేఖ,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆలయ అర్చకులు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పుష్కర స్నానాన్ని ఆచరించారు.

## పశుపోషకులకు దాణా బస్తాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు



**మైలవరం (ప్రశ్న న్యూస్)** వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించెందుకే దాణా పంపిణీ పశు పోషకులకు దాణా బస్తాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు .50 శాతం సబ్సిడీపై పశువులకు దాణా. పశువుల పెంపకందారులకు పోషకాలతో కూడిన పశువుల సమీకృత దాణా బస్తాలను 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వెల్లడించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా తెలుపు రంగు రేషన్ కార్డు కలిగిన సన్న, చిన్నకారు రైతులకు, పశుపోషకులకు రాయితీపై దాణాను అందజేస్తున్నట్లు వెల్లడించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో ఈ దాణా బస్తాలను స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గురువారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా 2 పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకుగాను 450 కేజీల దాణాను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ?1,100 విలువైన 50కేజీల బస్తాను ?555కే అందిస్తున్నట్లు తెలిపారు. పశుగ్రాసం కొరతను అధిగమించేందుకే ఈ చర్యలు చేపట్టామన్నారు. 20 శాతం ప్రొటీన్ కలిగిన ఈ దాణాను తొలిసారి అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 21 లక్షల మంది పశుపోషకులకు లబ్ధి కలిగించేలా రూ.69 కోట్ల వ్యయంతో 31,067 టన్నుల దాణా పంపిణీకి పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టిందన్నారు. ఈ రాయితీ వల్ల ఆర్థికంగా అదనపు భారం పడుతున్నప్పటికీ వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించి, నిలకడగా పాడి ఉత్పత్తులు సాధించడానికి కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. అర్హులైన పశుపోషకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## టిడిపి గ్రామ కమిటీల నూతన కార్యవర్గ ప్రతినిధులను అభినందించిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



**మైలవరం ( ప్రశ్న న్యూస్)** నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలు చురుగ్గా జరుగుతున్నాయి. తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశించిన మేరకు ఆయా గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పార్టీ విధివిధానాల మేరకు తెలుగుదేశం పార్టీ కార్యవర్గాలను ఎన్నుకుంటున్నారు. ఇటీవల జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామం, ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడు గ్రామ టీడీపీ శాఖల కార్యవర్గాలను ఆయా గ్రామాల్లో ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నిక కాబడిన తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖల కార్యవర్గాల ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ని విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కుంటముక్కల గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షునిగా యడవల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా బార్లపూడి నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా లింగాల జోజిబాబు, కోశాధికారిణిగా బార్లపూడి ఏసుమ్మ, కార్యదర్సులుగా మైలవరపు శ్రీహరి, సుఖభోగి జోజిబాబు, నక్కా జమలయ్య, కార్యనిర్వహణ కార్యదర్సులుగా సందిపాము జయలక్ష్మీ, లింగాల చిన్న వెంకటేశ్వరరావు, బడుగు తిరుపతమ్మలు ఎన్నికయ్యారు. ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడు గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షునిగా కాకి నాగరాజు గ్రామ పార్టీ ఉపాధ్యక్షునిగా పెసల రమేష్, గ్రామ పార్టీ సెక్రటరీగా నిమ్మగడ్డ చంద్రశేఖర్, గ్రామ తెలుగు యువత ప్రతినిధిగా ఆళ్ల నరసింహారావు (బుల్లెచ్చయ్య), గ్రామ బీసీ సెల్ అధ్యక్షునిగా ఎడ్ల రాంబాబు, గ్రామ ఎస్సీ సెల్ ప్రతినిధిగా కొంక శ్రీనివాసరావు, గ్రామ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా మాకాని వెంకాయమ్మ, తెలుగు రైతుఅధ్యక్షునిగా జాస్తి మోహనరావు, గ్రామ ఐటీడీపి అధ్యక్షునిగా నక్కా సునీల్ ఎన్నికయ్యారు. వీరందరూ శాసనసభ్యులు కృష్ణప్రసాదు ని కలిశారు. వీరందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ పార్టీ మరింత పటిష్ఠ పరచడానికి అందరూ ఐకమత్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు వారికి సూచించారు.

## బుడమేరు గట్టు రక్షణగోడ కాంక్రీట్ పనులు ప్రారంభించిన మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు



**మైలవరం (ప్రశ్న న్యూస్)** బుడమేరు గట్టు పరిరక్షణకు శాశ్వత ప్రాతిపదికన రక్షణగోడ నిర్మాణానికి చేపట్టనున్న కాంక్రీట్ పనులను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గురువారం ఉదయం ప్రారంభించారు. రూ.28 కోట్ల అంచనా వ్యయంతో దీన్ని నిర్మించనున్నారు. కొండపల్లిలోని శాంతినగర్ వద్ద బీడీసీ బుడమేరు డైవర్షన్ ఛానల్ కి గత ఏడాది అకాల వర్షాల ధాటికి మూడు చోట్ల భారీ గండ్లు పడిన విషయం తెలిసిందే. దీని కారణంగా విజయవాడ నగరాన్ని వరద నీరు ముంచెత్తింది. అప్పట్లో ఈ భారీ గండ్లను అత్యవసరంగా యుద్ధప్రాతిపదికన పూడ్చివేసి విజయవాడకు వరదముంపును నివారించారు. భవిష్యత్తులో కూడా బుడమేరు వరద నుండి విజయవాడ నగరానికి శాశ్వత ప్రాతిపదికన ముంపును నివారించేందుకు తాజాగా చర్యలు చేపట్టారు. గతంలో పడిన ఈ మూడు గండ్లను కలుపుతూ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నారు. దీని కాంక్రీటు పనులను భూమిపూజ చేసి ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ మొదలయ్యేలోగా, జూన్ 10వ తేదీలోగా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## జంపాల సీతారామయ్యకు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన: ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



మైలవరం (ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, సీనియర్ నేత జంపాల సీతారామయ్య కి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు. ఆయన నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డిస్కంల సీఎండీలతో సమీక్ష సమావేశం నిర్వహించిన: మంత్రి గొట్టిపాటి రవి కుమార్




**అమరావతి (ప్రశ్న న్యూస్)** వ్యవసాయ కనెక్షన్లు, కరెంట్ కోతలు, సూర్యఘర్ పనుల పురోగతి పై సమీక్ష పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు, విద్యుత్ కోతలు, పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై డిస్కంల సీఎండీలతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సచివాలయంలో సమీక్ష. సమావేశం నిర్వహించారు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు మంజూరు చేసిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై చర్చించారు. డిమాండ్ మేరకు రైతులకు అవసరమైనన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ సీజన్ నాటికి దరఖాస్తు చేసుకుని, అర్హులైన ప్రతీ ఒక్క రైతుకి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు. కరెంట్ కోతలు పై సమాచారాన్ని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు ఎట్టి పరిస్థితుల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరాను అందించాలని ఆదేశించారు. అప్రకటిత కరెంట్ కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగితే స్థానిక ప్రజలకు ముందస్తు సందేశం అందేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశానికి ఇటీవల మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీగా బాధ్యతలు చేపట్టిన పుల్లారెడ్డి హాజరుకాగా మరో ఇద్దరు సీఎండీలు వర్చువల్ గా హాజరయ్యారు.

## రైలులో మంటలు..ప్రయాణికులు సురక్షితం



**యాదాద్రి** యాదాద్రి జిల్లా బీబీనగర్ వద్ద రైలులో మంటలు చెలరేగాయి. మిర్యాలగూడ నుంచి కాచిగూడ వెళుతున్న రైలు భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి దాటుతుండగా పొగలు అలుముకున్నాయి. గమనించిన ప్రయాణికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. బీబీనగర్ రైల్వే స్టేషన్లో రైలును ఆపిన సిబ్బంది ఫైరింజన్ సహాయంతో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి అపాయం జరగలేదన్నారు.

# అక్రమ నిర్మాణాలకు కేరాఫ్‌గా 'కాప్రా' సర్కిల్

- అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు
- కాప్రా సర్కిల్ ఎక్కడ చూసినా విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు
- నోటీసులు సరే... చర్యలేవి.?
- డీసీ జగన్ నిర్లక్ష్యమే అక్రమ నిర్మాణాలకు మూలమా.?



పద్మశాలిటౌన్షిప్ లో ఆదనపు అంతస్తుల నిర్మాణాలు



పద్మశాలి టౌన్ షిప్‌లో అక్రమ నిర్మాణాలు

కాప్రా(ప్రశ్న న్యూస్) కాప్రా సర్కిల్ ఇప్పుడు అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎక్కడ చూసినా నిబంధనలకు విరుద్ధంగా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న భవనాలే కనిపిస్తున్నాయి. ఈ అక్రమ సామ్రాజ్యానికి డిప్యూటీ కమిషనర్ జగన్ సహకారం అధికారుల అవినీతి తోడుగావడంతో పాటు పలువురు ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండటంతో అడిగే నాథుడే కరువయ్యాడు. సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులకు లక్షల్లో లంచాలు ఇస్తున్నాం. మా ఇష్టం వచ్చినట్టు నిర్మించుకుంటున్నాం అంటూ ఫిర్యాదుదారులకు సవాల్ విసురుతున్నారు ఇందుకు కారణం అధికారులు లక్షల్లో లంచాలు తీసుకోవడమే అంటూ స్థానికులు మండిపడుతున్నారు. అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. సెట్ బ్యాక్ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అక్రమాలకు రహదారి కొందరు మున్సిపల్ సిబ్బంది అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి 'ముడుపులు' పుచ్చుకుంటే చాలు, ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్మాణాలు సాగిపోతున్నాయని స్థానికులు బహిరంగంగానే చెబుతున్నారు.దీనికి తోడు కొందరు స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ప్రశ్నించిన వారిని బెదిరించడానికి కూడా వెనుకాడటం లేదు. దీంతో సామాన్య ప్రజలు భయంతో నోరు మెదపలేని పరిస్థితి నెలకొంది. నిబంధనలు పూర్తిగా ఉల్లంఘిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డిప్యూటీ కమిషనర్ జగన్ కు ఎన్ని ఫిర్యాదులు చేసినా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని డిసి నిర్లక్ష్యంతోనే అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్న విమర్శలు వెలుగెత్తుతున్నాయి. ఈ అక్రమాలపై జోనల్ కమిషనర్, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నోటీసులు జారీచేసి లంచాలు తీసుకొని చేతులు దులుపుకుంటున్న సిబ్బంది అని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశామంటూ మున్సిపల్ సిబ్బంది చేతులు దులుపుకుంటు న్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాల వ్యవహరంపై అధికారులను అడిగితే నోటీసులు ఇచ్చామంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నోటీసులిచ్చినా నిర్మాణపనులను చకచక సాగుతున్నా, అంతస్తులపైన అంతస్తులు వేస్తున్నా అక్రమనిర్మాణదారులకు ఉచిత సలహాలచ్చి ప్రోత్సహించడంలో సిబ్బంది దిట్టానేనని తెలుస్తోంది. ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్ స్పందించి కాప్రా సర్కిల్ అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.





చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రధాన రహాదారి పక్కనే మేడమీద మేడ చేపడుతున్న అక్రమార్కులు...



చర్లపల్లి ఈసీనగర్ లో నిబంధనలు ఉల్లంఘించి చేపడుతున్న నిర్మాణం..

# కాల్పుల విరమణపై

## కీలక నిర్ణయం తీసుకున్న భారత్-పాక్

- మే 10 నాటి ఒప్పందం కొనసాగింపు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రస్తుతం ఇరు దేశాల మధ్య నెలకున్న ఉద్రిక్తతలను క్రమంగా తగ్గించే ప్రయత్నాలను కొనసాగించాలని భారత్–పాకిస్థాన్‌లు నిర్ణయించినట్టు సమాచారం. ఇందుకు సంబంధించి భారత్, పాక్ సైనిక ఆపరేషన్ల డైరెక్టర్ డైరెక్టర్ జనరల్స్ స్థాయిలో మే 10న జరిగిన తాత్కాలిక కాల్పుల విరమణ అవగాహన ఒప్పందం కొనసాగించేందుకు మొగ్గు చూపినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. నమ్మకాన్ని పెంపొందించే చర్యల్లో భాగంగానే ఇరుదేశాల సైనికాధికారులు ఇందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌న ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన ఘటన తర్వాత భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఏర్పడిన తాత్కాలిక సైనిక ఘర్షణ కాల్పుల విరమణ ఒప్పందంతో తగ్గుముఖం పట్టింది. ఇక, షరతులతో కూడిన ఒప్పందానికి భారత్ అంగీకరించిన విషయం తెలిసిందే. సిందూ నదీ జలాల ఒప్పందం తాత్కాలిక రద్దు.. పాక్ పౌరులకు వీసాలు, ఆ దేశ నటులు, యూట్యూబ్ ఛానెల్స్, కంటెంట్ నిషేధం వంటివి కొనసాగుతాయిని భారత్ స్పష్టం చేసింది. గత వారంలో నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' బ్రీఫింగ్‌లో పహల్గామ్ ఉగ్రదాడినే 'ప్రాథమిక ఉద్రిక్తత' కారణంగా భారత్ పేర్కొంది. సరిహద్దుల్లో నాలుగు రోజుల డ్రోన్, క్షిపణి దాడుల అనంతరం భారత్, పాకిస్థాన్‌లు ఘర్షణను ముగించుకునే విషయంలో ఒక అవగాహనకు వచ్చాయి. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని భారత్ ప్రిసిషన్ క్రూయిజ్ క్షిపణులు, గ్లైడెడ్ బాంబులతో దాడులు చేసింది. దీనికి ప్రతిగా భారతదేశంలోని పౌర ప్రాంతాలు, సైనిక స్థావరాలపై డ్రోన్లు, రాకెట్లతో పాకిస్థాన్ ప్రతిదాడులు జరిపింది.దీనిపై భారత్ తీవ్రంగా ప్రతిస్పందించింది. పాకిస్థాన్‌లోని అనేక విమానాశ్రయాలు, కీలక సైనిక ఆస్తులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. దాయాది డ్రోన్, క్షిపణి దాడులను తిప్పికొట్టింది. వీటిలో కొన్నింటి మూలం టర్కీ ఉత్పత్తి చేసిన సాయుధ డ్రోన్లే కావడం గమనార్హం. ఆపరేషన్ సింధూర్ అనంతరం ప్రదాని మోదీ జాతినుద్దేశించి ప్రసగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పాక్‌కు ఆయన వార్నింగ్ ఇచ్చారు. దీనిపై కూడా స్పందించిన పాకిస్థాన్ తామూ కాల్పులు విరమణకు కట్టుబడి ఉంటామని ఇస్లామాబాద్ తెలిపింది. 'మే 10న ఇద్దరు డీజీఎంఓల మధ్య జరిగిన అవగాహన మేరకు, నమ్మకాన్ని పెంపొందించే చర్యలు కొనసాగించేందుకు నిర్ణయించుకున్నాం. ఈ పరిణామాలపై భవిష్యత్తులో మరిన్ని వివరాలు తెలియజేస్తాం,' అని ఓ అధికారి తెలిపాడు. భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్, పాకిస్థాన్ దగమో డీజీఎంఓ మేజర్ జనరల్ కాషిఫ్ అబ్దుల్లా మధ్య ఈ అవగాహనకు ముందు చర్చ జరిగింది. భారత్ కొనసాగిస్తున్న 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా, దేశపౌరులపై దాడులు జరిగితే, ఉగ్రవాదులు పాకిస్థాన్‌లో ఎక్కడ ఉన్నా వారిని లక్ష్యంగా చేసుకునే దిశగా ఇది ఒక సైద్ధాంతిక మార్పుని సూచిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# ఆహారంలో "బల్లి" ఆవేశంలో కస్టమర్

- నాసిరకమైన భోజనాలు ఇస్తున్న మైఫీల్ హోటల్స్
- చర్యలు మరిచి మామూళ్లకు మరిగిన ఫుడ్ ఇన్స్పెక్టర్లు
- హోటళ్లపై తనిఖీలు లేకపోవడమే నాణ్యతకు తిలోదకాలు
- ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిన రేవంత్ రెడ్డి సర్కార్





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ జంటనగరాల్లో ప్రజల జీవనశైలి ఆహారపు అలవాట్లు గతం కన్నా భిన్నంగా ఉన్నాయి.గత ముప్పై ఏళ్ల క్రితం ప్రజలు ఇంటి వంటకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు చిన్న భిన్నంగా మారడంతో, కుటుంబంలో పెద్దలు,పిల్లలు ప్రవర్తనతో పాటు నూతన సాంప్రదాయాలు తెర మీదకు వస్తున్నాయి. ఫ్యామిలీలో మాట మాట పెరిగి పెద్ద పెద్ద గొడవలకు దారి తీస్తుంది. ఈ కారణంగా వంటిల్లు వైపు చూడని వసుధారలు. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో నగర ప్రజలు బయట ఫుడ్ కోడ్స్ నే ఆశ్రయిస్తున్నారు.

కొంతమంది అయితే వీకెండ్ లల్లోతో పాటు ప్రత్యేక సందర్భాల్లో హెూటల్స్ కు క్యూ కడుతున్నారు.కొందరైతే ఇంట్లో వంట చేసుకునే సమయం ఉన్నా కూడా బయట ఫుడ్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.దీంతోరెస్టారెంట్లకు భారీగానే గిరాకీ పెరుగుతుంది.ఇంట్లో వంట చేసుకోవడం మానుకొని, బయట ఆహారాన్ని లాగించేస్తున్నారు. నగరంలో ఉన్న చిన్న పెద్ద తేడా లేకుండా రెస్టారెంట్లో వాడుతున్న ఆహార పదార్థాలు, చూసి చూడకుండా "బొద్దెంక,బల్లి, ఎలుక ఇలా ఆహార పదార్థాలలో ఏమేసి పడుతున్న పట్టించుకొకుండా

వడ్డిస్తూ అడ్డంగా దొరికిపొతున్నారు నిర్వాహకులు. అలాగే పలు హెూటల్స్ లో నాణ్యత లేని వస్తువులు, పాడైన ఆహార పదార్థాలు వాడుతున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలో వెల్లడైన విషయం తెలిసిందే! నగరంలో హెూటల్స్, రెస్టారెంట్లల్లో ఫుడ్ సేఫ్టీ కమీషనర్ టాస్కోర్స్ బృందాలు తనిఖీలు నిర్వహించిన కొన్ని హెూటల్స్ లో మార్పు రావడం లేదు. ఈ నేపథ్యంలో నిన్న గురువారం నగరంలో వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో కుటుంబ సమేతంగా పేరు గాంచిన హెూటల్ కి వెళ్లారు. చికెన్ బిర్యానీ బాగుంటుందని ఆర్డర్ చేసి ఫుల్ గా లాగిస్తున్న సమయంలో బిర్యానీలో "బల్లి"దర్శనం ఇచ్చింది. తిన్న చికెన్ బిర్యానీ లో బల్లి.

ఇబ్రహీంపట్నం మై ఫీల్ ఫ్యామిలీ రెస్టారెంట్ లో ఈ ఘటన చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంగా ఉన్న సాగర్ రోడ్డులో" మై ఫీల్ ఫ్యామిలీ రెస్టారెంట్"లో గుజ్జ కృష్ణారెడ్డి మధ్యాహ్నం బిర్యానీ తినడానికి వెళ్లారు. అయన చికెన్ బిర్యానీ ఆర్డర్ చేసుకోగా,కళ్ల ముందు కనుపిస్తున్న కమ్మటి చికెన్ బిర్యానీ చూస్తూ లొట్టలు వేసుకుంటూ బిర్యానినీ ఫుల్ గా లాగిస్తున్న సమయంలో బిర్యానీలో "బల్లి" కనిపించడం తో ఒక్కసారిగా షాక్ కు గురైయ్యాడు.

వెంటనే తేరుకొని "మై ఫీల్ ఫ్యామిలీ రెస్టారెంట్" యజమాని నిలదీయగా నిర్వహుకుడు ఇచ్చిన సమాధానం ఏమిటంటే సార్ మంచిగా ఫ్రై అయింది తిను అని చెప్పడంతో కంగుతిన్న బాధితుడు వేంటనే పోలీసులకు 100 డయాల్ చేయగా వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు బిర్యానీ తిన్న బాధితుడిని టెస్టుల కోసం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, రెస్టారెంట్ మేనేజర్ ను ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ విషయం ఈ నోట ఆ నోటా ఊరంతా పాకడంతో ఆ రెస్టారెంట్ ముందు జాతర చోటు చేసుకుంది.ఇలాంటి నిర్లక్ష్యపు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588